ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ బుధవారం | 19 నవంబర్ 2025 | ■ 14 పేజీలు



# జల సంరక్షణకు జాతీయ పురస్కారం

3



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి పత్తి రైతుకు ఇన్ని పరీక్షలా..? వేల కోట్లు అప్పు చేసినవారికేమో సకల మర్యాదలు అని మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా, ఆదిలాబాద్‌లో పర్యటించిన ఆయన మార్కెట్ యార్డును సందర్శించి.. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను అరిగోస పెడుతున్నాయని.. పంట అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి రైతుల ప్రయోజనాలు అక్కర్లేదని..కేవలం రాజకీయాలు మాత్రమే చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పనికిమాలిన యాప్ కపాస్ కిసాన్ పేరిట, తేమ శాతం పేరిట, వేలిముద్రల లాంటి నిబంధనలు విధించి.. రైతులు పంట అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్న ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఉండి ఏంలాభమని అన్నారు. ఎకరానికి 7 క్వింటాల నుంచి 13 క్వింటాళ్లు పత్తి కొనుగోలు చేయాలన్నారు. కపాస్ కిసాన్ యాప్ రద్దు చేయాలని.. రెండు ప్రభుత్వాల మెడలు వంచేదాకా బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- రైతులకు కేటీఆర్ భరోసా
- బీఆర్ఎస్ మీవెంటే ఉంటుందని హామీ
- కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలి
- వర్షాలకు పత్తి పంటత నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేల పరిహారం ఇవ్వాలి
- పత్తి, సోయా రైతుల సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్దకు అఖిల పక్షాన్ని తీసుకు కెళ్లాలి
- ఆదిలాబాద్, భైంసాలో మార్కెట్ యార్డుల సందర్శన
- మార్కెట్ యార్డుల్లో అన్నదాతలతో ముఖాముఖి
- భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు
- తమ సమస్యలు, బాధలు ఏ కరువు పెట్టిన కర్షకులు
- చలించిన కేటీఆర్.. అండగా ఉంటామని హామీ
- తెలంగాణ ఉద్యమం లెక్క పోరాడుదాం

10

## బీఆర్ఎస్ మొసలి కన్నీరు



14

- పత్తి కొనుగోలు చేసినట్టు నిరూపిస్తే..
- ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేస్తా
- రైతుల పేరుతో రాజకీయాలు చేయొద్దు
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

## కేటీఆర్ ఓ విఫల నాయకుడు



- ఆయన నాయకత్వంలో అన్నీ ఓటములే
- 'స్థానిక' ఎన్నికల్లోనూ గుణపాఠం తప్పవదు..
- మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి
- వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన - 11లో

## రహదారులే కల్లాలు

ప్రభాత సమాచారం, లోకేశ్వరం

ముధోల్ నియోజకవర్గంలోని లోకేశ్వరం మండలంలో రైతులకు ధాన్యం ఆరబోత ఒక దీక్షగా మారింది. గతంలోని బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పంట ఉత్పత్తుల ఆర బోతకు తగిన కల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రధాన రహదారులపైనే కుప్పలుగా పోసి ఆరబెడుతున్నారు. వరి, మొక్క జొన్న, సోయా కోతలు ప్రారంభం కాగానే రోడ్లన్నీ కల్లాలుగా మారిపోతున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రధాన రోడ్లపై రాత్రి వేళల్లో సరిగ్గా కనిపించని ధాన్యం రాశుల కారణంగా ప్రయాణికులు రోడ్డు ప్రమాదాలకుగురై ప్రాణాలను కోల్పోతున్న దయనీయ పరిస్థితి నెలకొన్నది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సొసైటీలు, ఆర్అండ్‌బీ, పోలీస్ శాఖ అధికారుల్లో చలనం కరువైందని, అధికారుల అలసత్వం వల్ల ప్రతి ఏటా అనేక కుటుంబాల్లో విషాదం నిండుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

- మండలంలో రోడ్లపైనే వరి ధాన్యం ఆరబోత
- రహదారులపై మృత్యుపాం
- కనిపించని కల్లాలు.. పోతున్న ప్రాణాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



5

### పత్తి రైతుకు బిగ్ రిలీఫ్

## సమ్మె విరమించిన మిల్లర్లు

12

- రాష్ట్ర ప్రభుత్వంతో జిన్నింగ్ మిల్లర్ల చర్చలు సఫలం
- నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం
- రెండు రోజుల పాటు జిన్నింగ్ మిల్లుల బంద్
- మిల్లర్ల నిర్ణయంతో ఊపిరి పీల్చుకున్న పత్తి రైతులు



6

## ఇది.. పాఠశాలే..!

- శిథిలావస్థకు చేరిన గుడిసెలోనే బోధన
- తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ■ మరుగుదొడ్లూ కరువు
- మధ్యాహ్న భోజనం జాడే లేదు ■ పట్టించుకోని అధికారులు

# ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ క్లబ్‌ల ఏర్పాటు

- జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా 450 రోడ్ సేఫ్టీ క్లబ్‌ల ఏర్పాటు
- ప్రతి గ్రామంలో 5 గురు సభ్యులతో రోడ్ సేఫ్టీ క్లబ్
- 100 ప్రథమ చికిత్స కిట్ల సభ్యులకు అందజేత
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్





**గుడిహత్నూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జిల్లా వ్యాప్తంగా 30% ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా రోడ్ సేఫ్టీ క్లబ్ అనే కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం గుడిహత్నూర్ మండలం మన్నూరు గ్రామం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రారంభించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలను అరికట్టి ప్రాణన నష్టాన్ని తగ్గించడమే జిల్లా పోలీసుల లక్ష్యంగా నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలు, రహదారుల వెంట ఉన్న దాబా యజమానులు, పనివారు, పెట్రోల్ బంక్ వారు, వాహన, టైర్ల రిపేరు ప్రజలు, టీ స్టాల్ వ్యక్తులు, రోడ్ సేఫ్టీ క్లబ్ లో సభ్యులుగా కొనసాగుతారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 450 గ్రామాల్లో ప్రతి గ్రామం నుండి చురుకుగా పనిచేసే యువకులు వ్యక్తులు ఐదుగురు చొప్పున రోడ్ సేఫ్టీ క్లబ్ లో సభ్యులుగా ఉన్నారు. వీరి ముఖ్య కర్తవ్యం గ్రామాలలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన నియమ నిబంధనలు పాటించేలా రోడ్డు నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం. గ్రామాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాన్ని గుర్తించి, ప్రమాదాల నివారణకు చేయవలసిన చర్యలు స్పీడ్ బ్రేకర్లు, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తీసివేయడం, సూచిక బోర్డులను ఏర్పాటు లాంటి వాటిని అధికారుల దృష్టికి తీసుకురావడం వారి కర్తవ్యం. గ్రామాలలో ప్రజలకు ఆదర్శంగా ఉంటూ రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ వాటి ప్రాధాన్యతపై రోడ్డు ప్రమాదాలు జరిగే ఆవశ్యకతపై అవగాహనలు కల్పిస్తూ ప్రజలను చైతన్య పరచడం వీరి ప్రధాన కర్తవ్యం. రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భంలో ప్రాణాలను రక్షించే కర్తవ్యంలో వీరు ప్రధాన పాత్ర పోషించనున్నారు. ప్రమాదం జరిగిన స్థలంలో చేయవలసిన చర్యలపై క్షతగాత్రునికి హృదయ స్పందన ఊపిరి లేని సందర్భంలో సిపిఆర్ చేసి బ్రతికించే శిక్షణను ఈరోజు అందించడం జరిగిందని వీరు నిజ జీవితంలో ప్రాణాలను రక్షించే కర్తవ్యం చేయవలసి ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ స్వయంగా డాక్టర్ల బృందం చే ఏర్పాటు చేసిన సిపిఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు సిపిఆర్ విధానాన్ని చేసి ఆదర్శంగా నిలిచారు. దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా మరణించే వ్యక్తులు అధికంగా ఉన్నందున రోడ్డు ప్రమాదాల నివారించి ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు జిల్లా పోలీసులు చేస్తున్న వినూత్న ఆలోచనకు ప్రజలందరూ సహృదయంతో సహకరించాలని ఉత్సాహంగా పాల్గొంటూ రోడ్డు సేఫ్టీ క్లబ్‌లను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, డిఎస్పి జీవన్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కరీంనగర్ రేణే హాస్పిటల్, మంచిర్యాల మెడి లైఫ్ హాస్పిటల్, సిఐలు బండారి రాజు, కర్ర స్వామి, డి గురు స్వామి, ప్రసాద్, శ్రావణ్, ఎస్ఐలు పాల్గొన్నారు.



# హలో ఆదివాసి ఛలో ఉట్నూర్ జయప్రదం చేయాలి

## ఆదివాసీ మండల అధ్యక్షులు కోరెత తిరుపతి



**బెజ్జూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆదివాసి భవనంలో ఆదివాసీల ధర్మ యుద్ధం పోస్టర్లను ఆదివాసి నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసి మండల అధ్యక్షులు కోరిత తిరుపతి మాట్లాడుతూ ఆదివాసి బచావో లంబాడా హటావో అనే ప్రధాన నినాదంతో ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలని ఏకైక డిమాండ్ తో ఈ నెల నవంబర్ 23వ తేదీన ఉట్నూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో గ్రౌండ్‌లో ధర్మ యుద్ధం పేరిట భారీ బహిరంగ సభను 9 తెగల ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ అధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది అని వారు తెలియజేస్తూ ఉట్నూర్ మహా సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సిడం సాకారం, వ్యవస్థాపక అధ్యక్షులు కుర్సింగా ఓం ప్రకాష్, సర్మెడి కొడప శంకర్, కొలవార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్రం బక్కయ, కోయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మెస్రం రాజారాం, ఆదివాసీ మహిళ అధ్యక్షురాలు ఎనుకా అమృత, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు మెడి సతీష్, ప్రచార కార్యదర్శి సడ్మేక రమేష్, మాజీ సర్పంచులు కొమురం హన్మంతు, కర్పేత రమేష్, కొలవార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల శ్యామ్ రావు, కొలవార్ మండల ఉపాధ్యక్షులు మనేపెల్లి మల్లేష్, ఆదివాసీ నాయకులు కోరేత లలయ్య, గంగారాం, రాజారాం, పురుషోత్తం, నైతం సత్తయ్య, పేదం శ్రీహరి, ఏనుక శ్రీహరి, గెడం నందరం, కొడిపె వెంకటేష్, తోరెం వినోద్, సిడం షణ్ముఖ, జిల్లా సహాయక కార్యదర్శి పోల్కా వెంకటేష్, గవుడే గణేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లలో

# అక్రమాలకు పాల్పడితే చర్యలు

### నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

**లోకేశ్వరం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీలు చేశారు. లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు తీరును పరిశీలించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గల వసతులను చూశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేస్తూ, సంబంధిత రిజిస్టర్లు అన్నింటినీ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మన్మద్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు పలు కూలీలకు సూచనలు చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి, ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు.

# కేటీఆర్‌కు నిర్మల్ నేతల స్వాగతం

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

పత్తి రైతులకు మద్దతుగా నిర్వహించే ధర్నాలో పాల్గొనేందుకు వచ్చిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఘనస్వాగతం చేశారు. గంజాల్ టోల్ ప్లాజా వద్ద జిల్లా కన్వీనర్ రామకృష్ణారెడ్డి పట్టణ అధ్యక్షులు రాము పార్టీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఉన్నారు.



# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక పద్ధతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, మహిళా- శిశు సంక్షేమ, విద్య, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు,, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పని కల్పించేందుకు అవసరమైన పనులు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహించి, పనులను ఎంపిక చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టవలసిన పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు, తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేక మూత్రశాలల నిర్మాణాలు, భవన మరమ్మత్తులు, బ్లాక్ బోర్డులు, ఫ్యాన్లు ఏర్పాటు వంటి పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలు, భవనాల నిర్మాణాలు, వసతుల కల్పన పనులు త్వరగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, సంక్షేమ అధికారి భాస్కర్, విద్యా శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

# డిసెంబర్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లాలో డిసెంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌తో పాటు ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీఈవో భోజన్న, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్ మంగళవారం ప్రకటించారు. ఇందులో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించే మంచి అవకాశం ఉందని, అందరూ పాల్గొని ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ ఔదార్యం

**బెల్లంపల్లి, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

తిలక్ గ్రౌండ్ వాకర్స్ సామాజిక సేవలో ముందుకెళ్తుంది. అందులో భాగంగా మంగళవారం తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఇంక్లైన్బస్తీ నివాసి నరసయ్య కుటుంబాన్నీ పరామర్శించి, 56కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ నెల 9న నర్సయ్య మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వారి ఇంటికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిరుపేదలైన నరసయ్య కుటుంబానికి 50 కేజీ ల బియ్యం తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రత్నం రాజన్న, రంగ రామన్న, కంటెవాడ నాగేష్ కుమార్, రత్నం ఐలయ్య, కజ్జం రమేష్, కోయాడ శంకర్ గౌడ్, భీమిని కనకయ్య గౌడ్, తిప్ప రాజయ్య, గైని మల్లేష్,



# మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయి పురస్కారం




- జాతీయ స్థాయిలో విరాజిల్లిన మంచిర్యాల ఖ్యాతి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్) 2024వ సంవత్సరానికి గాను జాతీయ స్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాల్‌లో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా తరపున జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు జాతీయ స్థాయిలో మొదటి 3 స్థానాలు సాధించాయి. జల్ సంచాయి-జన్ భాగిదారి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం 5 లక్షల 20 వేల 362 పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకును సాధించింది. మొదటి కేటగిరిలో మంచిర్యాల జిల్లా అవార్డుతో పాటు 2 కోట్ల రూపాయల నగదు పురస్కారాన్ని పొందింది. కేంద్ర జలశక్తి శాఖ జాతీయ 6వ జల పురస్కారాలలో సంయుక్త విజేతలు సహా 46 విజేతలను ప్రకటించింది. ఈ పురస్కారాలను అత్యుత్తమ రాష్ట్రం, అత్యుత్తమ జిల్లా, అత్యుత్తమ గ్రామ పంచాయతీ, అత్యుత్తమ పట్టణ స్థానిక సంస్థ, అత్యుత్తమ పాఠశాల / కళాశాల, అత్యుత్తమ పరిశ్రమ, అత్యుత్తమ జల వినియోగదారు సంఘం, అత్యుత్తమ సంస్థ (పాఠశాల / కళాశాల కాకుండా) అత్యుత్తమ పౌర సంఘంతో పాటు జల రంగంలో అత్యుత్తమ వ్యక్తి అనే కేటగిరీలు ఉన్నాయి. ప్రతి పురస్కార విజేతకూ ప్రశంసపత్రం, ట్రోఫీతో పాటు కొన్ని కేటగిరీల్లో నగదు బహుమతులను అందజేశారు. జాతీయ సంపదగా పరిగణిస్తూ నీటి వనరుల్ని అభివృద్ధి చేయడం, సంరక్షించడంతో పాటు సమర్థంగా నిర్వహించడానికి అవసరమైన విధాన ప్రణాళికను సిద్ధం చేసి, ఆయా కార్యక్రమాలను అమలు పరిచే బాధ్యతను జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక కేంద్ర శాఖను ఏర్పాటు చేసి అప్పగించారు. నీటి నిర్వహణ, జల సంరక్షణల విషయంలో జాతీయ స్థాయిలో చైతన్యాన్ని పెంపొందింపచేయడానికి ప్రధాన మంత్రి మార్గదర్శకత్వంలో జల శక్తి శాఖ ఒక విస్తృత ఉద్యమాన్ని కొనసాగిస్తుంది. ఈ దృష్టి కోణానికి అనుగుణంగా, ప్రజల్లో నీటి ప్రాధాన్యం గురించి అవగాహనను పెంచడానికీ, నీటిని ఉపయోగించుకోవడంలో అత్యుత్తమ పద్ధతులను అనుసరించేలా వారిని ప్రోత్సహించడానికీ జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్) జాతీయ జల పురస్కారాలను ఇవ్వడాన్ని 2018లో మొదలుపెట్టింది. 2వ, 3వ, 4వ, 5వ జాతీయ జల పురస్కారాలను వరుసగా 2019, 2020, 2022, 2023 సంవత్సరాలలో అందించారు. హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)కు చెందిన రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో 2024 అక్టోబరు 23న 2024 సంవత్సర 6వ జాతీయ జల పురస్కారాల (ఎన్‌డబ్ల్యూఏ) ప్రక్రియను ప్రారంభించగా 751 దరఖాస్తులు వచ్చాయి. న్యాయ నిర్ణేతల సంఘం దరఖాస్తుల పరిశీలన, మూల్యాంకనం పూర్తి చేశారు. ఎంపిక చేసిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలనను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)తో కలిసి కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ) పూర్తి చేసింది. ఈ క్షేత్ర స్థాయి నివేదికలను ఆధారం చేసుకొని, సంయుక్త విజేతలు సహా మొత్తం 46 విజేతలను 2024 సంవత్సరానికి గాను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి, జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం కార్యదర్శి వి.ఎల్. కాంతా రావు, తాగునీరు, పారిశుధ్య విభాగం కార్యదర్శి అశోక్ కె.కె. మీనా, జల శక్తి శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు ఢిల్లీలో అరుదైన గౌరవం







- "జల్ చంచాయ్- జన్ భాగీధారీ" కార్యక్రమంలో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఆదిలాబాద్
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కలెక్టర్ రాజర్షి షా..

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "జల్ చంచాయ్- జన్ భాగీధారీ" కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు రూ.2కోట్ల నగదు ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్ర జనశక్తి మంత్రిత్వశాఖ 2025 సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జిల్లాకు అవార్డు లభించడం పట్ల కలెక్టర్ రాజర్షి షా హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషితో, ప్రజల భాగస్వామ్యంతో ఈ అవార్డు లభించిందని ఆయన అన్నారు. అధికారులకు, ప్రజలకు, సహకారం అందించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు పురస్కారం లభించడంపై అదనపు కలెక్టర్లు శ్యామల దేవి, ఐటీడీఏ పీవో యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని చబ్రా, అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## నిర్మల్ జిల్లాకు
# జల సంచాయ్-జన్ భాగీదారి అవార్డు

- కేంద్ర మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- జాతీయస్థాయిలో విరాజిల్లిన నిర్మల్ జిల్లా ఖ్యాతి
- అవార్డు లభించడంపై సంతోషం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

మరోసారి జాతీయ వేదికపై నిర్మల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. నిర్మల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయి-జన్ భాగీదారి అవార్డు లభించింది. మంగళవారం, కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ వేదికయ్యింది. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్-జన్ బాగీదారి అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు వీరందరికీ చెందుతుందని తెలిపారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఉన్నారు. నిర్మల్ జిల్లాకు జల సంచాయ్-జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు స్వీకరించిన కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి








- మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, ట్రాఫిక్ నియమ నిబంధనలపై, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం
- విద్యార్థినిలకు రక్షణగా అందుబాటులో పోలీసు అక్క
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ వ్యాప్తి చేస్తున్న సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత జిల్లా కోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నామని తెలిపారు. నషా ముక్త్ భారత్‌లో భాగంగా భారతదేశ అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మంగళవారం మావల మండలంలోని రెసోనన్స్ వరల్డ్ స్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా విద్యార్థులతో కలిసి అధికారులందరూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ కు వ్యతిరేకంగా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా సంకల్పంలో కొనసాగుతున్న యజ్ఞంలో భాగస్వామ్యం అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశం అభివృద్ధి దిశగా వెళ్లాలంటే మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని, జీవితంలో ఎన్నడూ కూడా మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాల స్థాయి నుండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. తల్లిదండ్రులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా హెల్మెట్‌ను ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. మహిళల రక్షణ కోసం జిల్లా పోలీసు వ్యవస్థ షీటీం బృందంతో 24 గంటలు భద్రతా చర్యలు చేపడుతున్నట్టు, షీ టీం బృందంతో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు నిర్భయంగా పోలీసు అక్కకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎక్కడైనా ఎలాంటి అన్యాయం జరిగిన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కున్న ఈవిటీజింగ్, ర్యాగింగ్, లాంటివి జరిగిన నిర్భయంగా పోలీసు అక్కకు తెలియజేయాలన్నారు. తమ సమాచారం బయటకు రాకుండా అల్లరి చేష్టలు నిర్వహించే వారిపై చర్యలు చేపడుతుందన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగానికి సంప్రదించాలంటే డయల్ 100 లేదా షీటీం బృందం సంప్రదించాలంటే 871 2659953 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, మావల సీఐ కర్ర స్వామి, ఎస్సైలు రాజశేఖర్ రెడ్డి, మనోహర్ సిబ్బంది పాల్గొన్నారు.






# భక్త జనసంద్రమైన కుభీర్.. ముగిసిన సప్తాహ వేడుకలు

■ మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు
■ వేలాదితరలివచ్చిన భక్తులు ■ భక్తులకు అన్నదానం

**కుభీర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో దినదినాభివృద్ధి చెందుతూ మరో పండరీపుర క్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీ విఠలేశ్వర ఆలయంలో ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహ వేడుకలు మంగళవారం అన్నదానంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ఆలయంలో విట్టల రుక్మిణి విగ్రహాలకు అభిషేకం, పుష్పార్చన, పట్టువస్త్రాల సమర్పణ అనంతరం కాకడ హారతి కన్నుల పండుగ సాగింది. విట్టల, రుక్మిణి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో పురవీధుల గుండా భజనలు, మేళ తాళాలతో స్వామి వారిని ఊరేగించారు. అనంతరం ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ పరమేశ్వర మహారాజ్ చే 'కాలా కీర్తన' కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. పరమేశ్వర్ మహారాజ్య తులసి మాలధారణ జరిగింది. పలువురు భక్తులు తులసి మాలధారణ వేసుకున్నారు. ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం కూడా ఎంతో వైభవంగా జరిగింది. ఈ జాతరలో మొత్తం 32 క్వింటళ్ల అన్నదానం భక్తులకు పంపిణీ చేయబడింది. ఈ మహత్తర సేవను గ్రామంలోని మున్నూరుకాపులు మరియు యాదవులు కలిసి నిర్వహించడం విశేషం. భక్తుల సందడి మధ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు,అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు సహ పంక్తి భోజనాలు చేశారు. సత్యం వేడుకల సందర్భంగా మంగళవారం కుభీర్‌లో జాతర సందర్భంగా పక్క రాష్ట్రమైన మహారాష్ట్రతో పాటు నిర్మల్ జిల్లాలోని వివిధ మం డలాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. జాతరలో రంగులరాట్నం వివిధ రకాల ఆహ్లాదాలను పంచే ఇన్స్ట్రుమెంట్స్ చిన్నారులను కనువిందు చేశాయి. ఈ సందర్భంగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సర్పంచ్ పానాజీ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోనె కళ్యాణ్, ఆలయ కమిటీ చైర్మన్ పెంటాజీ, మున్నూరు కాపు, యాదవ సంఘం అధ్యక్షుడు అరవింద్, దత్తాత్రి, విట్టల్, పిరాజి, ప్రసాద్, గంగాధర్, నాగలింగం, దత్తాత్రి, ఆయా గ్రామాల నుండి విచ్చేసిన వేలాది మంది భక్తులు జాతరలో పాల్గొన్నారు.



## నలుగురికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష

### ఒక్కొక్కరికి 12 వేల రూపాయల జరిమానా

**బెజ్జూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ మండల పరిధిలో మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించి, అత్యాచారం చేయడానికి ప్రయత్నించిన కేసులో నిందితులైన నలుగురికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.12,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఈ శిక్షను జిల్లా ప్రత్యేక కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం. వి. రమేష్ ప్రకటించారు. పిర్యాదుదారురాలు ఫిర్యాదు ప్రకారం, 05-12-2020 న ఫిర్యాదు దారురాలు ఆమె కూతురు(మైనర్ బాలిక)ఇంట్లో ఉన్న సమయంలో బెజ్జూర్ మండలంలోని తలాయి గ్రామానికి చెందిన చౌదరి జలపతి, చౌదరి సుధాకర్, లంగారి కృష్ణయ్య, లంగారి అంకయ్యలు తమ ఇంటికి వచ్చి దాడి ప్రయత్నం చేసి, అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారం చేసేందుకు యత్నించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు బాధ్యతలో మొదటి ఐ.ఓ ఆశన్న (ఎ.ఎస్.ఐ), రెండవ ఐ.ఓ ఎస్సై సందీప్, మూడవ ఐ.ఓ ఎస్సై డి.సాగర్ చేపట్టారు. కోర్టులో పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శ్రీనివాస్ బలమైన వాదనలు వినిపించగా, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, సిడిపిఓ రామ్ సింగ్ (ఎ.ఎస్.ఐ), సిడిఓ బాలాజీలు సహకరించారు.సాక్షాలు సాక్షాధారాలు దర్యాప్తు నివేదికను పరిశీలించిన కోర్టు పై నలుగురిని దోషులుగా తేల్చి, ప్రతి ఒక్కరికి ఐదు సంవత్సరాల కఠిన కారకార శిక్షతో పాటు 12 వేల రూపాయల జరిమానా విధించింది. ప్రస్తుత ఎస్ఐ సార్తజ్ పాషా, కౌటాల సీఐ సంతోష్ కుమార్, డిఎస్పీ వాహిదుద్దీన్ కేసు పర్యవేక్షణలో ఉన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అభినందించారు.

# రైతులకు అండగా బీఆర్ఎస్ : కేటీఆర్




**నేరడిగొండ, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతులు అధైర్య పడకూడదని, రైతులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసీఆర్ ఎల్లావేలలా అండగా ఉంటారని అన్నదాతలకు ధైర్యం చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రాష్ట్రంలో రైతులు పడుతున్న అష్టకష్టాలను ఎలుగెత్తి చాటాలని నిశ్చయించింది. ఇందులో భాగంగా కేటీఆర్ ఆదిలాబాద్ పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బాల్క సుమన్, దివాకర్ రావు, కోనేరు కోనప్ప తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో కొనసాగుతున్న పత్తి కొనుగోళ్ల బంద్

**తాండూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

పత్తి కొనుగోళ్లలో కొర్రీలను పెడుతూ రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా తెలంగాణ కాటన్ మిల్లర్స్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరవధిక బంద్ పిలుపులో భాగంగా తాండూర్ లో బంద్ కొనసాగుతోంది. దీంతో మంగళవారం కూడా తాండూర్ మండలం రేపల్లెవాడ శివారులోని మహేశ్వరి, వైభవ్ జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోళ్లు నిలిచిపోగా, శ్రీరామ జిన్నింగ్ మిల్లులో కూడా ప్రైవేట్ కొనుగోళ్లు చేపట్టలేదు. పత్తి మిల్లులను మూసి వేసి బంద్‌లో పాల్గొన్నారు. బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని తాండూర్ మండలంలోని పత్తి మిల్లులు మూసి వేసి ప్రధాన గేట్లకు నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు



ఫ్లెక్సీలను కాటన్ మిల్లర్స్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాటు చేశారు. బంద్ పై ముందస్తుగా ప్రచారం చేయడంతో రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాలేదు. దీంతో జిన్నింగ్ మిల్లుల ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. మిల్లర్లు బంద్‌ను పాటించిన విషయం విదితమే.

### ఛత్రపతి శివాజీపై అనుచిత వాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

**లోకేశ్వరం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**



బాసరలో ఛత్రపతి శివాజీ మహారాజ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలనిబోస్లే మోహన్ రావు పటేల్ కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠినంగా ఉండాలన్నారు. మహానీయులను కించపరచడం సరికాదన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. హిందువులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

## సోయా కొనుగోళ్ల నిలిపివేత

**కుభీర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రమైన కుభీర్‌తో పాటు పల్సిలో మార్కుఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోళ్లు కేంద్రాన్ని ఇక్కడి అధికారులు తాత్కాలికంగా నిలిపి వేయడం జరిగింది. ఇప్పటి వరకు కుభీర్, పల్సి మార్కెట్ యార్డ్‌లో కొనుగోళ్లు చేసిన సోయా లారీలు రాకపోవడంతో ఇక్కడి గోదాంలో తుఖం చేసిన సోయా అధికంగా కావడంతో కొనుగోళ్ల కేంద్రాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తున్నాళ్లు అధికారులు ప్రకటించారు. దింతో మండలంలో ఉన్న రైతులు పల్సి, కుభీర్ గోదాం లో ఉన్న సోయా బస్తాలు పూర్తి ఐన తరవాత మార్కెట్‌కు తీసుకురవాలని అధికారులు రైతులకు కోరారు.



# రహదారులే కల్లాలు

- మండలంలో రోడ్లపైనే వరి ధాన్యం ఆరబోత
- రహదారులపై మృత్యుపాశం
- కనిపించని కల్లాలు.. పోతున్న ప్రాణాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**లోకేశ్వరం, అక్టోబర్ 18 (ప్రభాత సమాచారం)**

లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వారి వరి, మొక్క జొన్న పంట ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గతంలోని బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుల పంట ఉత్పత్తుల ఆరబోతకు తగిన ప్లాట్‌ఫాంలను (కల్లాలు) ఏర్పాటు చేయడంపై దృష్టి సారించకపోవడంతో, మండల వ్యాప్తంగా కల్లాలు లేక రైతులు ప్రధాన రోడ్లపైనే వరి, మొక్క ధాన్యాన్ని కుప్పలుగా పోసి ఆరబెట్టుకుంటున్నారు. పంట పండించడం ఒక ఎత్తయితే, దానిని ఆరబెట్టుకోవడం మరొక దీక్షగా మారింది. వరి కోతలు ప్రారంభం కాగానే రోడ్లన్నీ ధాన్యపు కుప్పలతో నిండి కల్లాలుగా మారిపోతున్నాయి. దీని వల్ల రోడ్లపైన ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లన్నీ వరి ధాన్యం కుప్పలతో నిండిపోవడంతో ప్రయాణికులకు ప్రమాదాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రధాన రహదారులన్నీ రైతులకు ప్లాట్‌ఫాంలు (కల్లాలు) లేకపోవడంతో వారు పండించిన వరి ధాన్యంతో కల్లాలుగా దర్శనమిస్తున్నాయి. రైతులు పోసిన ధాన్యం రాశులు రాత్రి సమయంలో సరిగ్గా కనిపించకపోవడంతో ప్రయాణికులు రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్న దయనీయ పరిస్థితి నెలకొంది. పొలాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాంలు లేకపోవడంతోనే గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్లపై పంట ఉత్పత్తులను ఆరబెట్టుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి, రైతులకు పంట ఉత్పత్తులు ఆరబెట్టుకునేలా తగిన కల్లాలు నిర్మించి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అంతేకాక, రోడ్లపై పంట ఉత్పత్తులను రైతులు ఆరబెట్టుకుంటుండగా, ఆరిన ధాన్యాన్ని సరి అయిన సమయంలో కొనుగోలు చేయకపో వడంతో, రైతులు ఆ ధాన్యాన్ని కుప్పలుగా చేసి, వాటికి రక్షణగా తాటిపత్రిలను కప్పి రోడ్లపైనే ఉంచుతున్నారు. వరి ధాన్యం పంట ఉత్పత్తుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు, వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ, పాలకవర్గ సభ్యుల్లో, సొసైటీల పాలకవర్గ సభ్యుల్లో, రోడ్లు భవనాల శాఖఅధికారుల్లో, పోలీస్ శాఖ అధికారుల్లో చలనం కరువైందంటూ వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### నిత్యం ప్రమాదాలు...

ప్రమాదాలను నివారించడానికి, కల్లాలు నిర్మించేంతవరకు రోడ్లపై ఆరబెట్టిన పంటలకు తక్షణమే రేడియం స్టిక్కర్లతో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, రైతులు కూడా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దీనిపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. రైతులకు ధాన్యం ఆరబె ట్టడానికి కల్లాలు లేకపోవడంతో, లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని వారు తప్పనిసరి పరిస్థితుల్లో జాతీయ రహదారులతో సహా గ్రామీణ రోడ్లపై ఆరబోస్తున్నారు. బతుకు నిలిపే పంట రోడ్లపై మృత్యుపాశంగా మారి, ప్రతి ఏటా పదుల సంఖ్యలో ప్రయాణికుల ప్రాణాలను బలిగొంటోంది. ఈసారి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, ట్రాన్స్‌పోర్టు, హమాలీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నెమ్మదిగా జరుగుతోంది. అధికారుల అలసత్వం వల్ల అనేక కుటుంబాల్లో విషాదం నిండుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై పంట ఉత్పత్తులను ఆంబెట్టవద్దు ప్రధాన రహదారుల్లో రైతులు పండించిన పంటను ఆరబెట్టుకోవడం అనాదిగా వస్తుంది. ఇలా చేయడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణా నష్టం సంభవిస్తుంది. రైతులు ఆలోచించి రోడ్డు ప్రమాదాలు జరగ కుండా ప్రధాన రహదారులపై పంట ఉత్పత్తులను ఆరబెట్టడం మానుకోవాలి. పంట ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు అనువైన స్థలాలను ఎంపిక చేసుకోవాలి.



## కోలాం ఆదివాసీలకు అండగా ప్రజా ప్రభుత్వం

### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

కోలాం ఆదివాసీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని చెరువుగూడలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి, 53 ఇళ్ల మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. జీవితంలో ఇళ్లు కట్టుకోవడం ఇంటి యజమానికి ఒక కళనని, ఆ కళను రేవంత్ రెడ్డి నేతృత్వంలో నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకవస్తే ఆ సమస్యను పరిష్కరిస్తానన్నారు. దుష్ప్రచారాలను నమ్మి ధర్నాలు చేస్తూ మోసపోవద్దన్నారు. అంతకు ముందు బిర్సాయిపేట మాజీ సర్పంచ్ అంకవ్వ, గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి



**లక్షెట్టిపేట, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

పెరిగిన జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 24 శాతం రిజర్వేషన్లు పెంచాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు దమ్మ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంతి భవన ఆవరణలో 'మాలల రణభేరి సభ' వాల్ పోస్టర్లను మాల మహానాడు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దమ్మ నారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 23న జరిగే మాలల రణభేరి సభను విజయవంతం చేయాలని, మాలల హక్కుల సాధనకై జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నమ్మన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ స్కాలర్ షిప్, ఫీజు రియంబర్ మెంట్ లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాలల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చిన్నన్న, మల్లేష్, నర్సయ్య, లింగన్న, రాజు, శాంతి కుమార్, ప్రభాకర్, గరిసే రవీందర్, మల్లేష్, విజయ్, జనార్ధన్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు మానుకోవాలి




**బెల్లంపల్లి, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్యపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అర్ధరహితమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఖాజా పాషా అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతకాలంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక స్థానిక ఎమ్మెల్యే వినోద్, పట్టణ అధ్యక్షులు మల్లయ్య, పలువురు కాంగ్రెస్ నాయకులపై లేనిపోని ఆరోపణలకు దిగుతున్నారని మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలకు దిగుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి రూ 50 వేలు, రెండు మద్యం బాటళ్లు తీసుకుంటున్నారని ఆరోపించడం పూర్తిగా అవాస్తవమన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంతం లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. రోడ్డు విస్తరణలో బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని విధాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేస్తున్నారని, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి డబ్బులు తీసుకుంటున్నట్లు చేసిన ఆరోపణలు 24 గంటల్లోగా నిరూపించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే బీఆర్ఎస్ నాయకులపై పరువు నష్టందావా వేసి చట్టపరంగా వెళ్తామన్నారు.



## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, మండల తహసిల్దార్, కాగజ్ నగర్ డివిజనల్ ఇంజనీర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తున్నందున సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులకు వివరించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్మాణ దశలవారీగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల భవన్ పనులను వేగవంతం చేయాలని, భవనం పిల్లలకు ఉపయోగపడేలా అన్ని వసతులు కల్పించాలని, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లను ఆదేశించారు. మున్సిపల్ ఆస్తుల కొరకు ప్రతిపాదించిన స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థలాల గుర్తింపులో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు లక్ష్యానికి అనుగుణంగా నిర్ణీత సమయంలో పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**లోకేశ్వరం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

తానూర్ మండలం కోలూరు గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్డీఎం రామ్ గోపాల్, టీజీబీ మేనేజర్ ఆశిష్ గోలే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, పొదుపు ప్రాముఖ్యత, రుణాల సద్వినియోగం, డిజిటల్ బ్యాంకింగ్ ప్రయోజనాలు, ప్రభుత్వ ఆర్థిక పథకాల గురించి తెలియజేయడం జరుగుతున్నది అన్నారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, పశుసంవర్ధన రుణాలు, చిన్న వ్యాపార రుణాలు, మహిళా సంఘాలకు మద్దతు వంటి అంశాలను వివరించామన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ లిటరసీ సిబ్బంది రాపతి వినయ్, మల్లేష్, మహిళలు పాల్గొన్నారు.



# సమస్యల సుడిగుండంలో గిరిజన విద్య.. ఏళ్లుగా పట్టించుకోని ప్రభుత్వాలు



## అమలు కాని మధ్యాహ్న భోజన పథకం

**జైనూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

లింగాపూర్ మండలంలోని హీరాపూర్ గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల పూరిగుడిసెలో కొనసాగుతున్న వింత ఘటన వెలుగులలోకి వచ్చింది. ఈ విషయమై గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా కూలి పని చేస్తామని ఉదయమే లేచి పంట పొలాలకు వెళ్తామని, తమ పిల్లలకు మధ్యాహ్న భోజన పథకము లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాము ఇంటికి వచ్చేసరికి సాయంత్రం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి, తమ పిల్లలకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని, పాఠశాలకు పక్క భవనం నిర్మించాలని తెలియజేశారు. మైదాన ప్రాంతాల్లోని పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో అభివృద్ధి చేస్తున్నా ఐటిడీఏ పరిధిలోని గిరిజన విద్యాలయాలు మాత్రం ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. అధికారులు నిధులు విడుదల చేశామని చెబుతున్నా చాలా పాఠశాలలు ఇబ్బందులు నడుమ కొనసాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం విద్యార్థులు నానా ఇబ్బందుల మధ్య చదువు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల జిల్లా కమిటీ చైర్మన్ రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించడం శోచనీయమని, అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**ఆసిఫాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని సందీప్ నగర్‌లోని సిఎస్ఐ సెయింట్ జాన్ చర్చి ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన యు ఫీడ్ థెం ఆర్గనైజేషన్ వారి సహకారంతో మంగళవారం చర్చి ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్‌కు చెందిన వైద్యాధికారులు శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించారు. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 417 మంది పరిక్షలు చేసుకున్నారు. కంటి పరీక్షలు, ఈసీజీ, స్కానింగ్ తదితర పరీక్షలను నిర్వహించారు. కంటి పరీక్షల అనంతరం దృష్టిలోపం ఉన్నవారికి కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ రాజశేఖర్ వైద్యాధికారులు ఆల్ఫ్రెడ్, నందిని రెడ్డి, ప్రమోద్ చంద్ర, నిర్మలా జైన్, జితేంద్ర, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ప్రణీత్ సభ్యులు రాజేశ్వరి, లలిత పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరికి దేశభక్తి ముఖ్యం

**జన్నారం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ప్రతి ఒక్కరికి దేశభక్తి ముఖ్యమని జన్నారం మండల ఎంఈఓ విజయ్ కుమార్ అన్నారు. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని కలమడుగు గ్రామ జడ్పీ పాఠశాల విద్యార్థిని వైష్ణవి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ఆమెకు మంగళవారం నిర్వాహకులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

### రాంజీ గోండు ఆవాసం

## విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

**బెల్లంపల్లి, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలోని రాంజీ గోండు ఆవాసం విద్యార్థులకు మంగళవారం రాత్రి పద్మశాలి సభ్యులు, ఏఎంసి నెంబర్ 2 గ్రౌండ్ వాకింగ్ అసోసియేషన్ సభ్యులు చలి దుప్పట్లను అందజేశారు. తీవ్రమైన చలి కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని వారికి దుప్పట్లను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. పద్మశాలి సభ్యులు హనుమాండ్ల రమాదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల చిన్నచిన్న అవసరాలను తీర్చేందుకు తమ వంతుగా కృషి చేస్తామని చెప్పారు. రాంజీ గోండు ఆవాస విద్యార్థులకు శిశుమందిర్ పాఠశాల అందిస్తున్న విద్య ఆధారంగా సంఘంలో చిన్నప్పటినుండే మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులకు ఉన్నత విలువలు నేర్పిస్తూ రాంజీ గోండు ఆవాసం నిర్వాహకులు తిరుపతి చేస్తున్న సేవలను వారు కొనియాడారు. తాటిపాముల శారద సత్యనారాయణ, విజ్ఞ సాయి, చిదిరాల శ్రీలత ఉమా ప్రసాద్, శేషులు విద్యార్థులకు దుప్పట్లను అందించి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు.



# గబదిలీ వర్కర్స్‌కు పదోన్నతి పత్రాలు

**కాసిపేట, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

కాసిపేట -1 ఇంక్లైన్ గనిలో బదిలీ వర్కర్స్‌గా పనిచేసి జనరల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన 14 మంది ఉద్యోగులకు మంగళవారం పదోన్నతి పత్రాలను మేనేజర్ సతీష్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ అందచేశారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు క్రమశిక్షణతో, నైపుణ్యంతో పని సీజేసి సంస్థకు మంచిపేరు తేవాలని, రక్షణతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీశాన్, హిమాలయ, బన్న లక్ష్మన్ దాస్, రాజేందర్, సురేష్, రఘురామ్ పాల్గొన్నారు. బొగ్గు నాణ్యత వారోత్సవాలలో భాగంగా ఉద్యోగులకు నాణ్యతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలు ఎర్రవెల్లి శంకర్ కు మొదటి బహుమతి, బాలకిషన్‌కు రెండవ బహుమతి, సంతోష్ కు మూడవ బహుమతి కాన్సులేషన్ బహుమతి అశోక్‌కు మేనేజర్ సతీష్, దాగం మల్లేష్, మీనుగు లక్ష్మీనారాయణ అందచేశారు.



# 20న చిన్నపిల్లల ఉచిత గుండె వైద్య శిబిరం

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

రిమ్స్ డైస్‌లో ఈ నెల 20న చిన్న పిల్లల (1-18) ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచో రాథోడ్ నరేందర్, డైస్ మేనేజర్ డాక్టర్ రాధిక తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు ఇందులో 2డీ ఎకో చేయటంతో పాటు అవసరమైన పరీక్షలు చేసి చికిత్స అందిస్తారన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా అపోలో ఆసుపత్రి వైద్యులు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

# రైతులు అధైర్య పడొద్దు.. మీకు మేమున్నాం



**నేరడిగొండ, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

నేరడిగొండ మండలంలోని టోల్ ప్లాజా వద్ద మంగళవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వందలాది మంది కార్యకర్తలు, నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి నేరడిగొండలోని జిన్నింగ్ మిల్లులోని సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులు ఎవరూ అధైర్య పడకండి మీకు అండగా కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తాం అని అన్నారు. కేసీఆర్ హయాంలో ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసి రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూశామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



### ఆంక్షలు లేకుండా పంట

## కొనుగోలు జరపాలి

### జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో..!

**ముథోల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఆంక్షలు లేకుండా పంటల కొనుగోళ్లు జరపాలని మంగళవారం కుంటాల మండలం కల్లూరు గ్రామం జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పంటలు సరిగ్గా పండక పోగా, ఇటీవల తీరా పండిన పంట సోయాను సైతం కొనుగోలు జరిపి, నాణ్యత లేదని రిటర్న్ పంపించడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. నాణ్యత లోపం అంటూ అధికారులు రెండు రోజుల క్రితం కుంటాలలో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ సోయా కొనుగోళ్లు జరిపి, నిజామాబాద్ జిల్లాలోని బోధన్‌లో ఉన్న గోదాంకు తరలించారు. అయితే ఈ ధాన్యం పనికిరాదని..! నాసిరకంగా ఉందని అక్కడి అధికారులు లారిని తిరిగి పంపారని వాపోయారు. సంబంధిత ప్రభుత్వాలు కలగజేసుకొని, రైతులకు ఆంక్షలు విధించకుండా పంటలు కొనుగోలు చేయాలని జాతీయ రహదారిపై రైతులు సిడబ్ల్యూసి డౌన్ డౌన్ అంటూ... ఆంక్షలు లేకుండా పంటలు కొనుగోలు జరపాలంటూ నినాదాలు చేస్తూ రాస్తారోకో, నిరసన వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ మృతి

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఉపాధ్యాయుడు పద్దాడి ప్రశాంత్ (31) చికిత్స పొందుతూ మంగళవారం తెల్ల వారుజామున మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రశాంత్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అతడు శాంతి నగర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మరో బైక్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రశాంత్ మృతి పట్ల ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.



# రైతులను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- తేమశాతం నిబంధనతో రైతన్నకు నష్టం
- తమ పోరాటంతో వేలిముద్ర నిబంధన తొలగింపు
- రంగు మారిన సోయాను కొనుగోలు చేయాలి
- మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**లోకేశ్వరం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. మంగళవారం భైంసాలో పట్టణంలోని కాటన్ మార్కెట్‌ను సందర్శించి, పత్తి రైతులతో నేరుగా మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వాలు దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతుల సమస్యల పట్ల రెండు ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.పత్తి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు రెండు ప్రభుత్వాలే కారణమని ఆయన స్పష్టం చేశారు. అధిక వర్షపాతంతో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని ఉన్న కాస్త పంటకు ఎనిమిది శాతం తేమ కలిగి ఉండాలని నిబంధనతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. చలికాలంలో తేమశాతం పెరుగుతుందని తెలిసినా కేంద్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు.తమ ప్రభుత్వ హయాంలో 22 శాతం తేమ కలిగిన పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల మీద,రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదు అని ఆరోపించారు. పత్తి కొనుగోళ్లలో నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు.పత్తిలో తేమ 20 శాతం ఉన్నా కూడా కొనాలి అని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో ఏ విధంగా రైతులు పండించిన పంటలు కొన్నారో అదే విధంగా కొనుగోలు చేయాలని అన్నారు. జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను కూడా ఆయన ఈ సందర్భంగా పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గం అని పిలుపునిచ్చారు. బోనస్ దేవుడెరుగు... అసలు రైతన్న పండించిన పంట కొనేటోడే దిక్కులేదు అంటూ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కాంగ్రెస్, కేంద్ర బీజేపీ ప్రభుత్వాలు దిగొచ్చే దాకా బరాబర్ కొట్లాడుదాం అని భరోసా ఇస్తూ ఈ నెల 21వ తారీఖు నాడు రైతులందరూ బోరాజ్ కదిలి రావాలె అని రైతులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. మేము రైతులను కలుస్తాం అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయమెందుకు అని ప్రశ్నించారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుంటే మార్కెట్ యార్డ్‌ను ఎందుకు బంద్ పెట్టారు అని నిలదీశారు రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎల్లవేళలా ఉంటారని ధైర్యం చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతులకు కష్టం లేకుండా చూసుకున్నామని,ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని ఆయన గుర్తుచేశారు. మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది.. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఆయన పేర్కొన్నారు. గుండెల నిండా ప్రేమ ఉన్న వ్యక్తి నాయకుడైతేనే రైతుల జీవితాలు బాగుపడతాయని, ప్రస్తుత నాయకులు గెలిస్తే ఎలాంటి లాభం ఉండదని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఇంచార్జ్ జాన్సన్ నాయక్, ముథోల్ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ పడకంటి రమాదేవి, విలాస్ గాదేవార్, కిరణ్ కొమ్రెవార్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి

## ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్



**కౌటాల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కౌటల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సోయం సురేష్, మాజీ వార్డ్ మెంబర్లు కడతి శుక్రు, ఫుల్మేర్ ఫకిరా, మాడావి వత్తు, ఆరే సంఘం అధ్యక్షులు తంగడే ఉద్ధవ్ పటేల్, బడగే ఎడ్డి పటేల్, భలేపల్లి ఉప సర్పంచ్ ఠాకూర్ బండు, వార్డు మెంబర్ నికోడ్ రఘునాథ్‌తో పాటు మాతాజీ ట్రస్ట్‌కు చెందిన 40 మంది సభ్యులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం అని ,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి ప్రతి కార్యకర్త శ్రమించాలని. ప్రజా ఆశయాల సాధన కోసం కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాసర అమ్మవారి

# ఆలయ హుండీ లెక్కింపు

**ముథోల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం హుండీలను మంగళవారం ఆలయ 150 రూపాయలు అక్షరాభ్యాస మండపంలో లెక్కింపు ప్రక్రియను జరిపారు కార్తీకమాసం సందర్భంగా 30 రోజుల హుండీ లెక్కింపు గాను నలభై మూడు లక్షల పదహారు వేల ఏడువందల మూడు రూపాయలు సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దీంతోపాటు విదేశీ కరెన్సీ 10 నోట్లు మిశ్రమ వెండి ఒక కిలో 550 గ్రాములు మిశ్రమ బంగారం 60 గ్రాములు 900 మిల్లీ గ్రాములు లభ్యమైనట్లు వారు తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో ఎస్బిఐ బ్యాంక్ సిబ్బంది బాసర పోలీసులు శ్రీ భ్రమరాంబికా సేవా సమితి చేర్యాలవారు పాల్గొన్నారు.



## యువజన ఉత్సవాల్లో జిల్లాను

# మొదటి స్థానంలో నిలుపుదాం

## జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
యువజన ఉత్సవాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలుపుదామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమలోని కళా నైపుణ్యాన్ని, ప్రతిభను బాహ్య ప్రపంచానికి తెలియ పర్చడం కోసం ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన కళాకారులు రాష్ట్ర స్థాయిలోఆ తరువాత జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం కళాకారులను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, యువజన సంఘాల ప్రతినిధులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చేస్తే

# చట్టరీత్యా కఠిన చర్యలు

**నేరడిగొండ, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఐసీడీఎస్ సూపర్వైజర్ మంజుల హెచ్చరించారు. మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలోని కస్తూర్భా గాంధీ బాలికల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో బాలల హక్కులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఉన్నత విద్యను చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని పేర్కొన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు.

# అటవీ జంతువులను హతమారిస్తే చర్యలు

## బిర్సాయిపేట ఎఫ్ఆర్వో అరుణ

**ఉట్నూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
అటవీ జంతువులను పట్టుకొని హతమారిస్తే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని బిర్సాయిపేట రేంజ్ ఎఫ్ఆర్వో అరుణ పేర్కొన్నారు. మంగళవారం బిర్సాయిపేట రేంజ్ కార్యాలయంలో ఆమె వివరాలు వెల్లడించారు. రేంజ్ పరిదిలో మొగ్రిపేట్‌కు చెందిన రాము తనకున్న అడవికి సమీపంలో వ్యవసాయం భూమిలో వేసిన పంట పొలాల సమీపంలో ఉచ్చు బిగించాడు. ఈఉచ్చులో అటవీ జంతువు నీలుగాయి పడింది. ఈ జంతువును హతమా ర్చేందుకు తనతో పాటుగా అదే గ్రామానికి చెందిన మడవి బాపురావ్, ఆత్రం ఆనంద్ రావ్, జెండగూడ కి చెందిన ఆత్రం రాము, భీంజీ గూడకు చెందిన ఆత్రం యాదవ్ రావ్, ఒల్లేపు ఎల్లవ్వలు కలసి హతమార్చారు. ఈ సమాచారం తమకు తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని నీలుగాయి మాంసంతో పాటుగా వారి వద్ద నుండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆనంద్ రావ్, ఒల్లేపు ఎల్లవ్వ ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసుకొని కోర్టులో హాజరు పరచగా 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దంతన్ పల్లి ఫారెస్ట్ స్టేషన్ ఆఫీసర్ లచ్చన్న పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో

# ఇద్దరికీ తీవ్ర గాయాలు

**మామడ, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయలైన సంఘటన మామడ మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొరటికల్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రెండు బైకులు ఎదురుగదురుగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఒకరి చెయ్యి పూర్తిగా విరిగిపోయి రోడ్డుపైన పడింది. దీంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

# శివాజీపై అనుచిత వాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
బాసరలో ఛత్రపతి శివాజీ మహారాజ్‌పై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని, అట్టి వారిని కఠినంగా శిక్షించాలని మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ హైదరాబాదులో తెలంగాణ ఇంటలి జెన్స్ డిజి విజయ్ కుమార్‌ను కలిసి విన్నవించనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠినంగా ఉండాలనీ, దేశం కోసం, ధర్మరక్షణ కోసం పనిచేసిన మహనీయులను కించపరచడం సరైన విషయం కాదని అందువలన నిందితులను కఠినంగా శిక్షించాలని, మరో మారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపానన్నారు. అనంతరం లా అండ్ ఆర్డర్ ఏడీజిపి మహేష్ భగవత్ ను కలిసి, శాంతి భద్రతల పరిర క్షణపై కాసేపు చర్చించినట్లు పేర్కొన్నారు.



# పంటలు నీటి పాలు

- కడెం ప్రధాన కాల్వ సమీపంలోని మత్తడికి గండి
- మునిగిన 150 ఎకరాల్లోని వరి, పత్తి పంటలు
- చేతికొచ్చే దశలో నష్టపోయామంటూ ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు
- ప్రాజెక్టు గేటుకు మొద్దు అడ్డు పడిందన్న అధికారులు



**మంచిర్యాల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ శివారులోని కడెం ప్రధాన కాల్వ-42డీకి సమీపంలో 42 మత్తడికి వారం క్రితం గండి పడగా, సమీపంలోని పొలాలన్నీ నీట మునిగాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందకుండా పోతుండగా, రైతన్నలు కన్నీళ్లు పెట్టు కుంటున్నారు. ఇటీవల మొంథా తుపాన్ వల్ల కురిసిన వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరింది. ఆ సమయంలో అధికారులు నీటిని విడుదల చేయగా, 42 మత్తడికి గండి పడింది. అప్పటి నుంచి కడెం 42 ప్రధాన కాల్వ నుంచి వచ్చే నీరంతా పెద్దంపేట శివారులోని సుమారు 150 ఎకరాల్లోని వరి, పత్తి పంటల్లోకి చేరింది. కొలాంగూడ నుంచి దారి ఉన్నప్పటికీ.. పెద్దంపేట గ్రామ శివారులోని వాగును దాటుకొని పొలాల్లోకి వరి కోత మిషన్‌లు, ట్రాక్టర్లు, ఆటోలు, బైకులు, ఎడ్లబండ్లవంటివి వచ్చే వీలు లేకుండా పోయింది. కడెం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నిలిపివేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కడెం కాల్వ 42డీ-కి ఉన్న షటర్స్‌ను తెరిచి నీటిని కిందికి వదిలితే పంట నష్టం జరిగేది కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా.. కడెం ప్రాజెక్టు గేటుకు కర్ర మొద్దు అడ్డుపడిందని, దానిని తీసేందుకు నాలుగు రోజులుగా ప్రయత్నం చేస్తున్నామని, కర్ర మొద్దు బయటకు వస్తే గేటును దింపి నీటిని నిలుపుదల చేస్తామన్నారు. పూర్వ కడెం కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకూ సాగునీరందించేవారు. 42వ ప్రధాన కాల్వ ద్వారా పొలాలకు నీరు చేరేది. కానీ, ఇటీవల కురిసిన వర్షాలకు 42వ ప్రధాన కాల్వపైన ఉన్న మత్తడికి గండి పడింది. ఇంద్ర జల ప్రభ పథకంలో నిర్మించిన కుంట నిండిపోయి పొలాల్లోకి నీరు వచ్చి చేరింది. వరి పొలాలు కోయలేని పరిస్థితి వచ్చింది. చేతికొచ్చిన పంట నీటి పాలు కావడంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు.



## ఉపాధి హామీ పనులు కల్పించాలి

**లక్షెట్టిపేట, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియూ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కమిషనర్ విజయ్ కుమార్‌కు మున్సిపాలిటీలో ఉపాధి హామీ పనులు చేపట్టి ఉపాధి కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కనికరపు అశోక్, దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. లక్షెట్టిపేట మున్సిపాలిటిగా ఏర్పడక ముందు ప్రజలకు ఉపాధి హామీ పనుల ద్వారా పని ఉండేదని, కొంత ఇంటి ఖర్చుల కొరకు డబ్బులు ఉండేవి అన్నారు. మున్సిపాలిటీ తర్వాత మున్సిపాలిటీలో కలిపిన గ్రామాలలో ప్రజలకు ఉపాధి హామీ పనులు లేక ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేకుండా పోయిందన్నారు. ప్రజలు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మున్సిపాలిటీలో కూడా ఉపాధి హామీలు పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంధం రాజలింగు, సీఐటీయూ మండల కన్వీనర్ శోభ, మల్లేష్ పాల్గొన్నారు.

## 23న ఉట్నూర్ బహిరంగ సభను విజయవంతం చేయండి



**లక్షెట్టిపేట, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌తో ఈ నెల 23న చలో ఉట్నూర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసి సంఘాల నాయకులు కోరారు. మంగళవారం లక్షెట్టిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆదివాసీ బచావో లంబాడా హటావో అనే ప్రధాన నినాదంతో గత 30 సంవత్సరాల నుండి పోరాటం చేస్తున్నామన్నారు. వలస వచ్చిన లంబాలను ఎస్టీ జాబితా నుండి తొలిగించాలనే ఏకైక డిమాండ్ తో ఈ నెల నవంబర్ 23న ఉట్నూర్ కేంద్రంగా ఎంపీడీఓ గ్రౌండ్ లో ధర్మయుద్ధం పేరిట ఆదివాసిల భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు అన్ని ఆదివాసీల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు సూర్ పటేల్, మండల ఆదివాసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మెస్రం ఛత్రు, తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యదర్శి గుర్రాల శంకరయ్య, సాంస్కృతిక కార్యదర్శి బద్ది ధర్మయ్య, నాయకులు తొడప అచ్యుత్ రావు,కుర్సింగే విజయ్ కుమార్, కుర్సింగే రాము, బద్ది శ్రీనివాస్, ఆత్రం లింగా రావు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు నష్టం జరగకుండా చూస్తాం

**లోకేశ్వరం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కుంటాల పిఏసిస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన సోయా బ్యాగుల నాణ్యత విషయంలో రైతులకు నష్టం జరగకుండా చూస్తామని మార్పిడి జిల్లా అధికారి మహేష్ రైతులకు హామీ ఇచ్చారు. ఇటీవల కొనుగోలు చేసిన సోయపంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే గోదాముకు వెళ్ళిన తర్వాత అవి నాసిరకంగా ఉన్నాయని 365 కుంటల స్వయ బ్యాగులను తిప్పి పంపడంతో రైతులు తమ ఆవేదనను జిల్లా అధికారికి విన్నవించారు. రైతులు ఆందోళన చెందవద్దని నాణ్యమైన పంటను తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు భాస్కర్ దీక్షిత్ పటేల్ జుట్టు అశోక్ పడకండి దత్తు గజేందర్ దశరథ పోశెట్టి తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారంలో అధికారుల విఫలం



**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
శివారు కాలనీలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో జాడుచలావు యాత్ర నిర్వహించి శివారు కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువలు సిసి రోడ్లు లేవని ప్రభుత్వ పథకాలు అందడంలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్ శ్రీనివాస్ సాదిక్ మాజీ సాజిద్ పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ కార్యక్రమం

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఆఫీసు నందు నషా ముక్త్ భారత్ అనే అంశంపై మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఉద్యోగులులో భాగంగా మత్తు పదార్థాలకు ఎవరూ బానిస కాకుండా ఉంటామని అంతేకాకుండా ఇతరులను మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండే విధంగా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ ఎవరు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని ఇతరులను మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండే విధంగా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ లక్ష్మీ రాజు, మేనేజర్ అనూఫ్, సానిటరీ ఇన్స్పెక్టర్లు దేవదాసు, ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## తల్లిదండ్రుల పోషణ బాధ్యతగా భావించాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
వయో వృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమం పిల్లల బాధ్యతగా భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007పై ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన, అవగాహన సదస్సులో మాట్లాడారు. వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సక్షేమం ప్రతి ఒక్కరీ బాధ్యత అన్నారు. మొదటగా మనలో మార్పు వస్తే ఇతరులలో మార్పు తీసుకు రావచ్చని చెప్పారు. తల్లిదండ్రులు, పెద్దలపై గౌరవభావం కలిగి ఉండాలని సూచించారు. యువత ప్రస్తుతం మత్తు పదార్థాలకు బానిసలై క్షణికావేశంలో నేరాలు చేస్తున్నారని అన్నారు. ఆస్తుల కోసం కన్న వారిని, తోడబుట్టిన వారిని హాని చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో తల్లిదండ్రులను సరిగ్గా పోషించని కుమారులు, కూతుళ్లపై 28 కేసులు నమోదు చేసి వారికి నోటీసులు జారీ చేశామని అన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మార్పునకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో ఆర్‌డీవో, కాగజ్ నగర్ డివిజన్‌లో సబ్‌కలెక్టర్ స్థాయి వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టం ప్రకారం ట్రిబ్యునల్ పని చేస్తున్నాయని తెలిపారు. అనంతరం గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ జడ్జి అనంతలక్ష్మి, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి అందాల నడుమ నేహా



'చిరుత' సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన నేహా శర్మ తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంటుందని అంతా భావించారు. చిరుత సినిమా హిట్ కావడంతో బ్యాక్ టు బ్యాక్ పెద్ద హీరోల సినిమా ఆఫర్లు వస్తాయి అనుకున్నారు. కానీ నేహా శర్మ తప్పడు అడుగుల కారణంగా కెరీర్ మొత్తం తలకిందులు అయిందనే వారు చాలామంది ఉన్నారు. చిరుత వంటి మంచి హిట్ మూవీ తర్వాత కాస్త గ్యాప్ తీసుకుని సినిమాలను ఎంపిక చేసుకుంటే తప్పకుండా పెద్ద సినిమా ఆఫర్లు వచ్చేవి. చిన్న సినిమాలకు ఓకే చెప్పడం, పెద్దగా ప్రాధాన్యత లేని సినిమాల్లో నటించడం వల్ల ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. టాలీవుడ్‌లోనే కాకుండా ఈమె ఇతర భాషల్లోనూ నటించింది. కానీ లక్ ఈమెకు కలిసి రాలేదు. కానీ అందంతో పాటు, ప్రతిభ ఉన్న కారణంగా ఇండస్ట్రీలో ఇప్పటికీ కొనసాగుతోంది.నేహా శర్మ ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా 17 ఏళ్లు పూర్తి అవుతుంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అవుతున్నా కూడా పాతికేళ్ల పడుచు అందం అన్నట్లుగా కనిపిస్తూ కవ్విస్తూ ఉంది. 37 ఏళ్ల వయసులోనూ టీనేజర్ మాదిరిగా కనిపిస్తున్న నేహా శర్మ చాలా మందికి ఇప్పటికీ అభిమాన నటి అనడంలో సందేహం లేదు. నాజూకు అందంతో పాటు, ఫోటో జెనిక్ ఫేస్ కావడంతో నేహా శర్మను చాలా మంది ఇప్పటికీ అభిమానిస్తూనే ఉంటారు. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని చాలా మంది అంటూ ఉంటారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమె షేర్ చేసే ఫోటోలు, వీడియోలను చూస్తే ఆ విషయం నిజం అనిపిస్తుంది. తాజాగా మరో ఫోటో షూట్ తో నేహా శర్మ చూపు తిప్పనివ్వడం లేదు. బాబోయ్ ఏంటి ఈ అందం అంటూ చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేసేలా ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 20 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న నేహా శర్మ ఎప్పటిలాగే మరో అందమైన ఫోటో షూట్ ను షేర్ చేసింది. ఈసారి అందమైన ప్రకృతిలో నేహా కనిపించింది. సహజంగానే నేహా శర్మ చాలా అందంగా ఉంటుంది బాలీవుడ్‌లో ఎక్కువగా ఈమె సినిమాలు చేస్తుంది. మంచి పాత్రలతో అప్రోచ్ అయితే తప్పకుడా సౌత్ సినిమాలు చేస్తాను అని ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో నేహా శర్మ చెప్పకొచ్చింది. తప్పకుండా ఈ అమ్మడు మరోసారి టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేయాలని ఈ ఫోటోలు చూసిన వారు కొందరు కామెంట్స్ చేస్తున్నారు. నేహా శర్మ అందం ఏమాత్రం తగ్గకపోగా మరింత అందంగా ఇప్పడు కనిపిస్తుంది. కనుక హీరోయిన్‌గా మరో పదేళ్ల పాటు నేహా శర్మ కు ఆఫర్లు వచ్చే స్కోప్ ఉంది. మరి ఫిల్మ్ మేకర్స్ పట్టించుకుంటారా అనేది చూడాలి.

# 'జై హనుమాన్'కు లైన్ క్లియర్..



"హనుమాన్" సూపర్ హిట్ తర్వాత దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించే సీక్వెల్ "జై హనుమాన్" కోసం అభిమానులు భారీగా ఎదురుచూస్తున్నారు. సినిమా ఒక సంవత్సరం క్రితమే ప్రకటించినప్పటికీ, షూటింగ్ ఇంకా ప్రారంభం కాకపోవడంతో అభిమానులు కొంత నిరాశ చెందారు. అయితే ఇప్పుడు చివరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యి, సినిమా షూట్ త్వరలోనే మొదలుకానుందని సమాచారం.2024 సంక్రాంతికి విడుదలైన "హనుమాన్" ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అందుకే సీక్వెల్ వెంటనే మొదలవుతుందని భావించారు. కానీ పలు కారణాల వల్ల సినిమా వాయిదా పడింది.మొదట ఈ సినిమాలో హీరోగా నటించాల్సింది రిషబ్ శెట్టి. అయితే ఆయన "కాంతారా 2" పనులతో బిజీగా ఉండటంతో తేదీలు ఇవ్వలేకపోయారు. ఈ సమయంలో ప్రశాంత్ వర్మ రణవీర్ సింగ్‌తో మరో సినిమా ప్రారంభించగా, అది ఆగిపోయింది. అలాగే మోక్షజ్ఞ డెబ్యు సినిమా కూడా వివరణ లేకుండా ఆగిపోవడంతో, "హనుమాన్" తర్వాత దర్శకుడు వర్మ ఒక్క సినిమాను కూడా తెరకెక్కించలేకపోయారు.ఇప్పటికే ఈ సమస్యలు అన్నీ క్లియర్ అయ్యాయి. రిషబ్ శెట్టీ ఇప్పడు జై హనుమాన్ కోసం తేదీలు కేటాయించారు. ప్రశాంత్ వర్మ పూర్తి స్క్రిప్ట్ రెడీ చేయడంతో పాటు, చాలా మేర ప్రీ-ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేశారు. అందువల్ల సినిమా షూట్ ఒక్కసారిగా వేగంగా ప్రారంభమవుతుంది.ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్నారనే విషయం ఇప్పటికే అధికారికం. మొత్తం మీద, "జై హనుమాన్" షూటింగ్ ఆలస్యమైనా, ఇప్పుడు అన్నీ సక్రమంగా సెట్ అవడంతో అభిమానులందరూ మళ్లీ ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారు. సినిమా ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందో త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.

# నేను అలాంటి దాన్ని కాదు..



తన కొత్త తెలుగు చిత్రం 'ఫంకీ' (విశ్వక్ సేన్ హీరోగా) విడుదలకు సిద్ధమవుతున్న సమయంలో, నటి 'కయాదు లోహార్' తనపై వచ్చిన ఆరోపణల గురించి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో భావోద్వేగంగా మాట్లాడింది.కయాదు మాట్లాడుతూ, "ఇలా నాపై అనవసర కామెంట్లు వస్తాయని ఎప్పుడూ ఊహించలేదు. 'మర్చిపో' అంటారు కానీ అది అంత సులభం కాదు. నేను నా కలలను నిజం చేసుకోవడానికి కష్టపడ్డాను. అయినా నాపై ఇలాంటి మాటలు రావడం చాలా బాధగా ఉంది. నిజంగా నేను ఆ మాటలకు అస్సలు ఓకే కాదు," అని చెప్పింది.కొంత కాలం క్రితం ఆమె పేరు 'TASMAC స్కామ్'లో ED దర్యాప్తుతో అనుసంధానమైందని గాసిప్స్ వచ్చాయి. తమిళనాడులో ప్రభుత్వానికి చెందిన మద్యం సంస్థ అయిన TASMACకు సంబంధించిన ఆర్థిక అక్రమాలపై వచ్చిన ఈ కేసులో ఆమె పేరు అనవసరంగా లాగారని చెప్పింది.ఈ రూమర్స్ బయటకు వచ్చినప్పటి నుండి, సోషల్ మీడియాలో కయాదు పై పలు ఆరోపణలు, ముఖ్యంగా కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు ప్రచారంలోకి వచ్చాయి. ఇవన్నీ తనను చాలా బాధపెట్టాయని ఆమె స్పష్టంగా తెలిపింది.తమిళంలో ప్రదీప్ రంగనాథన్ సరసన అశ్వత్ మారిముతు దర్శకత్వం వహించిన "డ్రాగన్" సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న కయాదు, తమిళ-తెలుగు ప్రేక్షకుల ప్రేమను సమానంగా అందుకుంది.ప్రస్తుతం, 'ఫంకీ' ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఆమె, తనపై వచ్చిన తప్పడు ప్రచారాల వల్ల మానసికంగా కుంగిపోయినా, ఇవన్నీ దాటి ముందుకు సాగాలని ప్రయత్నిస్తున్నట్లు చెప్పింది. ఈ ఆరోపణలు ఆమె కెరీర్‌పై ప్రభావం చూపకూడదని అభిమానులు ఆశిస్తూ, సోషల్ మీడియాలో ఆమెకు మద్దతు తెలియజేస్తున్నారు.

# 'రాజాసాబ్' ఫస్ట్ సింగిల్ డేట్ ఫిక్స్..



ప్రభాస్ -మారుతీ కాంబినేషన్‌లో రూపొందుతున్న హారర్ కామెడీ "ద రాజా సాబ్" పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుంచి వచ్చే ఫస్ట్ సింగిల్ కోసం అభిమానులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ పాట విడుదల తేదీ పలుమార్లు మారడంతో ఫ్యాన్స్ కొంత నిరాశ చెందారు. మొదట ఈ పాటను ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలని అనుకున్నారు. ఆ తర్వాత నవంబర్ మొదటి వారానికి మార్చినా, ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో #WakeUpRajaSaab వంటి హాష్‌ట్యాగ్‌లు సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి.ఇప్పడు తాజా సమాచారం ప్రకారం, రాజా సాబ్ ఫస్ట్ సింగిల్ నవంబర్ 24న విడుదల కానుంది. ఈ విషయాన్ని అధికారికంగా టీమ్ ఈ వారం ప్రకటించే అవకాశం ఉంది. వచ్చే ఏడాది జనవరి 9న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కావడం వల్ల, ఈ నెల లోపలే ప్రమోషన్స్ ప్రారంభించాల్సిన అవసరం టీమ్‌కు ఉంది.దర్శకుడు మారుతీ ఈ సినిమాను ఫుల్ ఎంటర్టైనింగ్ హారర్ కామెడీగా తెరకెక్కిస్తున్నారు. బాహుబలి తర్వాత ఎక్కువగా సీరియస్ యాక్షన్ సినిమాలతో కనిపించిన ప్రభాస్, ఈసారి తన కామెడీ యాంగిల్‌ను మళ్లీ చూపించబోతున్నాడు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. క్లైమాక్స్‌కు సంబంధించిన ఫైట్ సీక్వెన్స్ షూట్ పూర్తయితే మొత్తం చిత్రీకరణ ముగిసినట్టే. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. టీజర్ ప్రకారం ప్రభాస్ డ్యూయల్ రోల్లో నటిస్తున్నట్లు స్పష్టంగా కనిపించింది.హీరోయిన్లుగా నిధి అగర్వాల్, మాళవిక మోహన్, రిద్ధి కుమార్ నటిస్తున్నారు. బాలీవుడ్ నుండి సంజయ్ దత్, బొమన్ ఇరానీ ముఖ్య పాత్రల్లో కనిపించబోతున్నారు. మొత్తంగా, ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న "ద రాజా సాబ్" ఫస్ట్ సింగిల్ చివరకు రిలీజ్ డేట్‌ను లాక్ చేసుకుంది. ఈ పాటతో సినిమా ప్రమోషన్స్ వేగం పెరగనుంది.






# అధైర్యపడొద్దు.. అండగా మేమున్నాం

- అన్నదాతలకు మాజీ మంత్రి కేటీఆర్ భరోసా
- బీఆర్ఎస్ మీవెంటే ఉంటుందని హామీ
- కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలి
- వర్షాలకు పత్తి పంటత నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేల పరిహారం ఇవ్వాలి
- రైతు సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్దకు అఖిల పక్షాన్ని తీసుకు కెళ్లాలి..
- ఆదిలాబాద్, భైంసా మార్కెట్ యార్డుల సందర్శన
- మార్కెట్ యార్డుల్లో అన్నదాతలతో ముఖాముఖి
- భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు
- సమస్యలు, బాధలు ఏ కరువు పెట్టిన కర్షకులు
- చలించిన కేటీఆర్.. అండగా ఉంటామని హామీ
- తెలంగాణ ఉద్యమం లెక్క పోరాడుదామని వ్యాఖ్య

## రైతులు చావొద్దు.. ప్రభుత్వాలను చావగొట్టాలె





(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్ ప్లాజాకు 10.30 గంటలకు చేరుకోగానే ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛ అందించి స్వాగతించారు. బాణ సంచా కాల్చారు. నాయకులు, కార్యకర్తలు జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్ మధ్య ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వెళ్లారు. అక్కడ రైతులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు నిర్మల్ బయలుదేరారు. సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద నాయకులు స్వాగతం పలికారు. సాయంత్రం భైంసా పట్టణంలోని గాంధీగంజ్‌లో రైతులతో మాట్లాడారు. పత్తి, సోయా పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నిబంధనల ఫలితంగా తాము పంటలు మద్దతు ధరతో అమ్మే పరిస్థితులు లేవని రైతులు కేటీఆర్‌కు విన్నవించారు. అధిక వర్షాలతో ఇప్పటికే పంటలు నష్టపోయిన తాము ఉన్న పంటలను అమ్ముకొని మద్దతు ధర పొందాలంటే సీసీఐ, మార్క్‌ఫెడ్ నిబంధనలతో పంట తిరస్కరణకు గురువుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలతోపాటు ఉష్ణోగ్రతలు 7 నుంచి 8 డిగ్రీలు నమోదవుతున్న కారణంగా.. పత్తిలో తేమ ఎక్కువగా ఉంటుందని, సీసీఐ అధికారులు తేమ పేరిట పంటను తిరస్కరిస్తున్నారని తెలిపారు. దీంతో తాము ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించి రూ.1500 నష్టపోతున్నామని రైతులు పేర్కొన్నారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో మిగతా పత్తిని తక్కువ ధరకు ప్రైవేటులో విక్రయించి నష్టపోతున్నట్లు తెలిపారు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి ఎండనకా, వాననకా పండిస్తే.. కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షరతులు పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సోయాను ఎకరాకు ఏడు క్వింటాళ్లు కొంటుందని, పంటల అమ్మకంలో రైతుల వేలిముద్రలు తప్పనిసరిగా చేశారని, ఓటీపీ లేకపోవడంతో వృద్ధ రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాసంగి సాగులో వ్యవసాయానికి కరెంటు కోతల కారణంగా నష్టపోతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొడుతుందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ కాకపోవడంతోపాటు యూరియా దొరకక పంటలు నష్టపోయినట్లు పేర్కొన్నారు. పంటల కొనుగోళ్లలో ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా ఉంటామని, మద్దతు ధర లభించేలా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా కల్పించారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వస్తున్నారనే విషయం తెలుసుకొని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో కదలివచ్చారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు తెలుపడానికి ఉత్సాహం చూపారు. పోటీ పడుతూ పంట అమ్మకాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలు ఏ కరువు పెట్టారు. యువనేత కేటీఆర్‌తో కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. కేటీఆర్ మాట్లాడుతున్న సమయంలో కేరింతలు కొడుతూ ఉత్సాహం చూపారు.

**కేటీఆర్‌కు స్వాగతం పలికిన ముక్రా(కే) గ్రామస్తులు..**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ముక్రా (బి) చౌరస్తాలో ముక్రా(కే), ముక్రా(బి) గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు బొట్టు పెట్టి శాలువాతో సన్మానించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ముక్రా(కే) మాజీ సర్పంచ్ మీనాక్షి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పోరాటాలతోనే సమస్యల పరిష్కారం..**

పోరాడితే పోయేది ఏమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అనే శ్రీశ్రీ మాటలతో రైతులు సమస్యలపై బీఆర్ఎస్ పోరాటాలు చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యువనేత కేటీఆర్ అన్నారు. అందరూ కొట్లాడితేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని.. పత్తి, సోయా కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా రైతులకు ఆందోళనలు నిర్వహించాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతుల సమస్యలపై ఈనెల 21వ తేదీన ఎన్‌హెచ్-44పై భోరజ్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను సక్సెస్ చేయాలని కోరారు. సీసీఐ తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని, ఎకరాకు 12 క్వింటాళ్లు సేకరించాలని, సోయా కొనుగోళ్లలో మార్క్‌ఫెడ్ ఎకరాకు ఏడు క్వింటాళ్ల నిబంధన, వేలిముద్రలు తీసివేయాలన్నారు. తాము వస్తున్నామని తెలిసి సోయా కొనుగోళ్ల పరిమితి పది క్వింటాళ్లకు పెంచిందన్నారు. కార్యక్రమంలో జోగురామన్న, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సుమన్, చిన్నయ్య, కొనప్ప, మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పాల్గొన్నారు.



## కపాస్ యాప్‌ను రద్దు చేయాలి

- కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి
- వారికి కోట్లు ఎగ్గొట్టే వారికి లేని నిబంధనలు.. గిరిజన పత్తి రైతులకెందుకు..?



పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అమలు చేస్తున్న కఠిన నిబంధనలు సడలించాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆదిలాబాద్ సీసీఐ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సీసీఐ అధికారులను కలిసిన కేటీఆర్ రైతుల సమస్యలు వివరించారు. జిల్లాలో వర్షాలు, చలితీవ్రత కారణంగా తేమ ఎక్కువగా ఉందని డిసెంబరు వరకు ఎలాంటి నిబంధన లేకుండా పంటను కొనాలన్నారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లు కాకుండా 13 క్వింటాళ్లు కొనాలని, కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలో కొనుగోళ్లు జరపాలన్నారు. జిన్నింగ్ మిల్లుల గ్రేడింగ్ విధానంలో ఎల్1, ఎల్2, ఎల్3 పద్ధతిని రద్దు చేసి అన్ని మిల్లులకు కొనుగోలు చేసే అవకాశం కల్పించాలన్నారు. కౌలు రైతులు, ఏజెన్సీలోని ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలున్న గిరిజన రైతుల పంటను నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. నిబంధనల కారణంగా రైతులు పత్తిని అమ్ముకోకుండా ఇండ్లలో నిల్వ చేసుకుంటన్నందున ప్రమాదవశాత్తు కాలిపోయి నష్టపోతున్నారన్నారు.



## పంటల విక్రయానికి షరతులా : మాజీ మంత్రి జోగు రామన్న



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు కష్టపడి సాగు చేసిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి షరతులు విధిస్తూ ఇబ్బందులు పెడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న మండిపడ్డారు. మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో నిర్వహించిన రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌లో పత్తి అమ్ముకొనే అవకాశం లేకపోవడంతో జైనథ్ మండలానికి చెందిన రైతు తిరుపతి, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర రైతు సురేశ్‌లు పత్తి పంట కాలిపోయిందన్నారు. జిల్లాలో అధికవర్షాలు, ఎనిమిది డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతల కారణంగా పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని తేమ నిబంధనలు సడలించాలన్నారు. సోయా పంటతో చెత్తా, చెదారం ఉందని మార్క్‌ఫెడ్ కొను గోలు చేయడం లేదని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు రైతుల సమస్యలను పట్టిం చుకున్న పాపాన పోలేదని తెలిపారు. ఈ నెల 21న ఆదిలాబాద్ జిల్లా భోరజ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# సోయా రైతుకు తప్పని తేమ కష్టాలు

- సోయా రైతును మళ్లీ ముంచారు!
- విక్రయించిన పంట వాపస్..
- పంటను తిరిగి పంపుతున్న నాఫెడ్
- ఇప్పటికే కుంటాలకు చేరిన రెండు లారీలు
- అధికారులు నాణ్యత పరీక్షించి, గోదాములకు పంపినా అంగీకరించని వ్యాపారులు
- 20శాతం కోతకు సరే అంటే దించుకుంటామని పట్టు



**ముథోల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
వ్యాపారులు సోయపంట రైతులను మరోసారి నిలువుగా ముంచారు. రెండు నెలలపాటు కంటికి రెప్పలా సోయ పంటను కొనుగోలు కేంద్రంలో పోసి నాణ్యత ప్రమాణాల ప్రకారం తూకం వేసి, గోదాములకు తరలిస్తే.. సోయపంటను నిలువ చేసుకోవాల్సిన నాఫెడ్ అధికారులు ప్రభుత్వం కొన్న సోయపంట నాసిరకం అంటూ తిరిగి కొనుగోలు కేంద్రాలకు వాపాస్ పంపడం చర్చనీయాంశంగా మారింది. అసలే ఆలస్యంగా ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు సోయ పంటను అమ్మారు. తూకం వేసి గోదాములకు తరలిస్తే ఈ పంట మాకొద్దు అంటూ వ్యాపారులు సోయ బ్యాగులను వెనక్కి పంపుతున్నారు. నిర్మల్ జిల్లాలో సుమారు లక్ష ఎకరాలు సోయపంట సాగు చేయగా ప్రభుత్వం పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం రూ.5,310 మద్దతు ధర నిర్ణయించగా.. ప్రైవేట్‌లో రూ.4,200 కి కొంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ధరకు అమ్మేందుకు రైతులు కొనుగోలు కూపన్ల కోసం పడరాన్ని పాట్లుపడ్డారు. కూపన్ అందిన తర్వాత కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పరిశీలించి, నాణ్యతగా ఉందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గుర్తించిన తర్వాతే కొన్నారు. పంటను కొనుగోలు చేసి నాఫెడ్ సంస్థకు లారీల్లో తరలించారు. ఇలా నిర్మల్ జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కుంటాల, కుబీర్, తానూ టరు, భైంసా, ముధోల్, బాసర, సారంగాపూర్, నిర్మల్ మండలాల్లో కొనుగోలు చేసిన సోయను నాఫెడ్ గోదాములకు నిలువ ఉంచుకునేందుకు పంపారు. అక్కడ సోయా నాణ్యతగా లేదు అంటూ లారీలను తిప్పి పంపడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. నాలుగు రోజుల క్రితం కుంటాల సొసైటీకి చెందిన సోయా లారీలను గోదాముకు తరలిస్తే అక్కడి వ్యాపారులు సోయా పంట నాసిరకం అంటూ రెండు లారీలను తిరిగి పంపారు.

**వంద కిలోలకు 20 కిలోలు తగ్గిస్తేనే సరి..**
పంట పండించిన రైతులను అనేక విధాలుగా మోసం చేస్తున్న వ్యాపారులు ఇప్పుడు నాణ్యత పేరుతో కొనుగోలు చేసిన పంటలో కోత ఒప్పుకుంటేనే స్వీకరిస్తామంటూ మెలికలు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు తేమ శాతాన్ని పరిశీలించిన తర్వాతనే తూకం వేస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసి గోదాములకు పంపిన తర్వాత అది నాసిరకంగా ఉన్నదంటూ వ్యాపారులు మెళిక పెడుతున్నారు. 20శాతం నష్టానికి ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తామని సొసైటీ అధికారులకు, రైతులకు సమాచారం ఇస్తున్నారు. అంటే 100 కిలోల బస్తాను 80 కిలోలకు లెక్కించి డబ్బులు రైతు ఖాతాలో జమ చేస్తారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి, తాము చెప్పిన డిమాండ్‌కు అంగీకరిస్తేనే దించుకుంటామని లేకపోతే వాపస్ తీసుకెళ్లాలని మొండికేస్తున్నారు. దీంతో లారీలు గోదాముల వద్ద రెండు మూడు రోజుల నుంచి నిలిచిపోవడం వల్ల రవాణా చార్జీలు భారంగా మారుతున్నాయి. ఈ చార్జీలు కూడా రైతులపైనే మోపుతున్నారు. గోదాములకు వెళ్లిన సోయపంట తిరిగి వస్తే రైతులు మళ్లీ ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లా మార్క్‌ఫెడ్ అధికారుల దృష్టికి రైతులు ఈ సమస్యను తీసుకెళ్లినా వారు చేతులు ఎత్తివేయడంతో తమ పరిస్థితి ఏం కావాలని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గోదాములకు తరలించిన సోయపంట తిరిగి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

**జైనూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుం దెబ్బ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసీ ధర్మ యుద్ధ సభ నిర్వాహణ కోసం ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. లంబా డాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల చట్టాలు, హక్కులను కాలరాస్తూ ధనికులకే వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఆదివాసీ డిమాండ్లపై ఈ నెల 23న ఉట్నూరులో నిర్వహించ తలపెట్టిన ఆది వాసీ ధర్మ యుద్ధ సభను విజయవంతం చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి అన్ని ఆదివాసీ సంఘాల నాయ కులు, పటేళ్ళు, దేవారిలు, మహాజన్‌లు, సార్మేడిలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో సార్మేడిలు ఆత్రం ఆనంద్‌రావ్, జుగునాక దేవరావ్, అనక దేవెందర్, ఆ త్రం ఆనంద్‌రావ్, మేస్రాం నాగోరావ్, పపెందుర్ ప్రకాష్, సెడ్మకీ భగ్వం త్‌రావ్, గాడాం మోహన్, మడావి క్రిష్ణ, పుండలిక్ పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ



**మంచిర్యాల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 17న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా అథ్లెటిక్స్ మీట్‌లో పట్టణంలోని కార్మెల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ సారూప్య తెలిపారు. మంగళవారం ప్రతిభ కనబరిచిన శాన్వి కృష్ణ, ఎం శ్రీనిధి, సృష్టి యోగ్యితలను ప్రిన్సిపల్ తోపాటు వైస్ ప్రిన్సిపాల్ సోఫీ, పీఈటీ అనిల్ కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమాలను విజయవంతం చేయాలని విద్యాశాఖ ఆర్జేడి సత్యనారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం వివిధ పాఠశాలలను సందర్శించి డీఈవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు తొలిమెట్టు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న అధికారులున్నారు.



## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేయాలి

**మంచిర్యాల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
డ్రగ్స్ రైతు సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని, యువత చెడు మార్గాలను ఎంచుకోకుండా సన్మార్గంలో నడిచే మంచి భవిష్యత్తు పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ, మంచిర్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల, ఆల్ ఫోర్స్, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం డ్రగ్స్ పై అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డిఎంఅండ్‌హెచ్‌ఓ అనిత, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ ప్రసాద్, ఎక్సైజ్ సీఐ గురవయ్య, ఎక్సైజ్ ఎస్సై శంకర్, డీ హెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ సౌజన్య, ఎఫ్ఆర్ఓ ఫర్జానా పాల్గొన్నారు.



## లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



**జన్నారం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
రాజ్యాంగ విరుద్ధంగా చట్ట విరుద్ధంగా ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న లంబాడాలను ఎస్టి జాబితా నుంచి, ఎస్టీ సర్టిఫికెట్ తొలగించాలని డిమాండ్ చేస్తూ 23న ఉట్నూర్‌లోని ఎంపీడీవో గ్రౌండ్స్‌లో ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీల ధర్మ యుద్ధ భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని, ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చలో ఉట్నూర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయి సెంటర్ ఆధ్వర్యంలో 9 తెగల ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంవత్సరాల నుండి లంబాడ సోదరులు చట్ట విరుద్ధంగా రాజ్యాంగ విరుద్ధంగా ఆదివాసి తెగలకు అందవలసిన రిజర్వేషన్స్ విద్య వైద్యం ఉద్యోగం ఉపాధి అభివృద్ధి సంక్షేమ పథకాలన్నీ అన్ని కూడా లంబాడ సోదరులే అనుభవిస్తూ నేడు ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేస్తూ వస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. మేము చేస్తున్న ప్రజా పోరాటం న్యాయపోరాటం రాజకీయం పోరాటలకు అన్ని వర్గాల ప్రజలు ప్రజాస్వామిక వాదులు మేధావులు బుద్ధి జీవులు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సహాయ సహకారాలు అందించి ఉట్నూర్‌లో 23న జరిగి ఆదివాసీల ధర్మ యుద్ధ భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పుసం సోనేరావ్ రాయి, సీడం కాళీ, మండాడి ననేశ్వర్, దుర్వ యశ్వంత్ రావు తుడసం గంగు పటేల్, ఆడాయి హన్మంత్ రావు, మర్సుల వసంత్, ఆత్రం మహేష్, తోటి సంఘం రాష్ట్ర కార్యదర్శి పెండోర్ రాజేష్, పర్ధన్ సంఘం కుర్సెంగా శ్రీనివాస్, కొలం సంఘం కోడోప ఆనంద్, నాయక పోడు రాయా రాజేశువర్, ఉర్వేత ధర్మ, తుడుం దెబ్బ కార్యదర్శి సోయం కిరణ్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో మహిళా సంఘాల కీలక పాత్ర

### అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

### ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటినీ నిర్మాణం చేసుకోవడంలో మహిళా సంఘాల సభ్యుల పాత్ర చాలా కీలకమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం డబ్బులు లేకుంటే మహిళ సంఘాల నుండి కొంత డబ్బులు అందించే బాధ్యత మహిళా సంఘాల సభ్యులపై ఉందని అన్నారు. బైట ఉద్యోగాలు లేక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని, అందుచేతనే ఉద్యోగం వచ్చిన మీరు విదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరుపేదలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఎలాంటి రాజకీయాలు లేకుండా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా అబివృద్ధి కోసం తాను ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిలను ఎన్నోసార్లు కలిసి సమస్యలను విన్నవించడం జరిగిందని వివరించారు. అంతకు ముందు ఆదిలాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు, ఇతర వివరాలతో కూడిన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. బల్దియా అధికారుల, వార్డుత ఆఫీసర్లతో అభివృద్ధి పనులపై సమీక్షించారు.

# ఏండ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని సబ్ స్టేషన్

**కుభీర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని మాలేగాం గ్రామంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు గాను, రెప్పపాటు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకుగాను మాలేగాం దాని చుట్టుపక్కల 15 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా సుమారు రూ. 1.10 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు గాను నిధులను మంజూరు చేసి పనులను సైతం ప్రారంభించింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టకముందే 90 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆ సబ్ స్టేషన్‌ను ప్రారంభించకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. మండల రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ప్రకృతి కన్నెర్రతో సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక తీవ్ర నష్టాల్లో మునిగిపోయిన సంగతి తెలిసిందే. ఈ యాసంగిలోనైనా కొంతమేర నష్టాలను పూడ్చుకుందామని భావించి ఈపాటికి మొక్కజొన్న, సెనగ, పసుపు పంటలు సాగు చేశారు. "అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని" అన్న చందంగా యాసంగి పంటలు సాగుచేసిన రైతుల పరిస్థితి మారింది. పట్టింపు లేని పాలకులు, జిల్లా అధికారుల



నిర్లక్ష్యం, ముందు చూపులేని విద్యుత్ శాఖ అధికారుల కారణంగా రైతులు కనీసం అర ఎకరానికి కూడా నీరందించలేని పరిస్థితి ఏర్పడింది. అనధికారిక విద్యుత్ కోతలు, తరచూ ఎల్సీ ఇవ్వడం, మరమ్మత్తుల పేరిట విద్యుత్ సరఫరాలో అంతరాయం, ముఖ్యంగా లోవోల్టేజీ సమస్య రైతులను వేధిస్తోంది. మాలేగాంతో పాటు చుట్టుపక్కల 15 గ్రామాలకు విద్యుత్ సమస్య వెంటాడడంతో సాగుచేసిన పంటలు ఎండిపోతాయన్న భయం రైతులను పట్టిపీడిస్తోంది. సబ్ స్టేషన్ ప్రారంభించమని కుభీర్ ఏఈతో పాటు సబ్ డివిజనల్ విద్యుత్ శాఖ అధికారులకు రెండేళ్ల నుండి రైతులు మొర పెట్టుకుంటున్నప్పటికీ పట్టించుకున్న నాధుడు లేడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది యాసంగిలో విద్యుత్ సమస్యలు తలెత్తి కుంటాల మండలంలోని ఓలా ఇతర సబ్ స్టేషన్‌ల నుండి ప్రత్యేక లైన్ వేసి మండల రైతులకు విద్యుత్ సరఫరా చేశారు. ఈ ఏడు వర్షాలు అధికంగా కురిసిన నేపథ్యంలో శనగతోపాటు మొక్కజొన్న, నువ్వులు తదితర పంటలు సాగు చేశారు. గతేడాది యాసంగి కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం అధికంగా పెరిగింది. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులను ముందే సాగు చేయవద్దని విద్యుత్ శాఖ అధికారులు గ్రామాలలో దండోరా వేయిస్తే తాము ఎందుకు పంటలను సాగు చేసుకునే వారమని సాగు చేసుకున్న తర్వాత ఈ బాధలు పెడుతున్నారని రైతులు దుమ్మెత్తి పోస్తున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యుత్ శాఖ జిల్లా అధికారులు స్పందించి వెంటనే మాలగంలో నిర్మించిన సబ్ స్టేషన్‌ను ప్రారంభించి రైతులకు నాణ్యమైన, కోతలు లేని లోవోల్టేజ్ లేకుండా, విద్యుత్ సరఫరా చేయాలని లేని పక్షంలో కుభీర్ సబ్ స్టేషన్ ముందు రైతులతో నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.



## మత్తులో నడిపి..
# విధ్వంసం సృష్టించి

**కాగజ్‌నగర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
పట్టణంలో ఓ యువకుడు మద్యం మత్తులో కారు నడపి విధ్వంసం సృష్టించాడు. సీఐ ప్రేంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పంచశీలనగర్‌కు చెందిన దుర్గం రాహుల్ మద్యం మత్తులో సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అంబేడ్కర్ చౌరస్తా వైపు కారులో అతివేగంగా వచ్చాడు. విగ్రహం బేస్‌మెంట్‌ను, అక్కడి నుంచి సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతోపాటు అక్కడే ఉన్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్నాడు. పహారా నిర్వహిస్తున్న ఎస్సై గడ్డం లక్ష్మణ్ వివరాలు సేకరించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో 99ఎంజీ ఆల్కహాల్ పాజిటివ్ వచ్చిందని, నిందితుడితోపాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో కార్మికులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో వంట కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. భోజనం కోసం అవసరమయ్యే వంట సామాగ్రి కొనుగోలు కోసం చేతిలో డబ్బు లేక అప్పులు చేసి వడ్డీ చెల్లిస్తున్నారని వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**ఉట్నూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఆదివాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉట్నూర్ ఐటీడీఏ ఇన్చార్జ్ పీవో యువరాజ్‌ను టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ కోరారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఇన్చార్జ్ పీవోను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల పోషణ, సంక్షేమం పిల్లల బాధ్యత

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎం.వి. రమేష్



**ఆసిఫాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
వయోవృద్ధులు, తల్లితండ్రుల పోషణ, సంక్షేమం పిల్లల బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి. రమేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సం స్థ, జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్‌ల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వయోవృద్ధులు - తల్లితండ్రుల పోషణ, సంక్షేమ చట్టం- 2007పై ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన, అవగాహన సదస్సు కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజ, జూనియర్ సివిల్ జడ్జ్ డి.కె. రాణి, జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, మండల అధికారి లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ ... వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మొదటగా మనలో మార్పు వస్తే ఇతరులలో మార్పు తీసుకురావచ్చని, తల్లిదండ్రుల పట్ల, పెద్దల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం మత్తు పదార్థాలకు బానిసలై క్షణికావేశంలో నేరాలు చేస్తున్నారని, ఆస్తుల కోసం కన్నవారికి, తోడబుట్టిన వారికి హాని చేస్తున్నారని తెలిపారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణ కొరకు ఉన్న చట్టాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు.

# నషా ముక్త్ భారత్ నిర్మాణానికి సహకరించాలి




**మంచిర్యాల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
నషాముక్త్ భారత్ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది, సీపీవో సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఇతరులను దూరంగా ఉండేలా చైతన్యం కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. యువతలో అవగాహన పెంచేందుకు గాను పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టి వారిని పట్టుకోవడం, మత్తుకు బానిసలుగా మారిన వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించడం, రెహబిలిటేషన్ సెంటర్లకు పంపించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నషా ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రజలు, యువత సహకారం కీలకమన్నారు. అడిషనల్ అడ్మిన్ డీసీపీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏవో శ్రీనివాస్, సీఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



# సమ్మె విరమించిన మిల్లర్లు

- రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు సఫలం
- నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం
- రెండు రోజుల పాటు జిన్నింగ్ మిల్లు బంద్
- ఊపిరి పీల్చుకున్న పత్తి రైతులు

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
సీసీఐ కొత్త నిబంధనలు సడలించాలని పత్తి కొనుగోళ్లు నిలిపివేసిన వ్యాపారులు, మిల్లర్లు సమ్మె విరమించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీసీఐ అధికారులతో జరిపిన చర్చలు విజయవంతం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నేటి నుంచి మార్కెట్‌తో పాటు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర కాటన్ అసోసియేషన్ సభ్యులు ప్రకటన విడుదల చేశారు. నేటి నుంచి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని అన్ని మార్కెట్లు, జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేయనున్నారు. నేటి నుంచి పత్తి కొనుగోళ్లను చేపడుతామని రాష్ట్ర కాటన్ అసో సియేషన్ అధ్యక్షుడు ప్రకటించారు.

## మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే
# వెంటనే ఫిర్యాదు చేయాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**



మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారు వెంటనే సీఈఐఆర్ వెబ్ పోర్ట్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. మంగళవారం సెయిర్ వెబ్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకున్న 41 మొబైల్ ఫోన్లను బాధితులకి అప్పగించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి మొబైల్ అనేది తప్పనిసరి వస్తువు అయిందన్నారు. ప్రతి చిన్న పనితో పాటు యూపీఐ లావాదేవీలకి సైతం మొబైల్ ప్రధానమైందని తెలిపారు.



## వరి ధాన్యంతిని యాభై గొర్రెలు మృతి

**మంచిర్యాల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

హాజీపూర్ మండలం కొండాపూర్‌లో వరి ధాన్యం తిని మంగళవారం 50 గొర్రెలు మృతి చెందగా.. మరి కొన్ని అపస్మారక స్థితిలోకి వెళ్లాయి. బాధి తులు, పశు వైద్యురాలు హారిక కథనం ప్రకారం.. పెద్దంపేట, కొండాపూర్‌కు చెందిన మేరుగు రాజయ్య, గుర్రాల రాజలింగు, పెట్టెం సుధాకర్లకు చెందిన గొర్రెలను సోమవారం మేతకు తీసుకెళ్లి రాత్రివేళ కొండాపూర్‌లోని పంట పొలాల్లో ఉంచారు. మేతకు వెళ్లిన క్రమంలో సుమారు 50 గొర్రెలు వరి ధాన్యంతిన్నాయి. ధాన్యం జీర్ణం కాకపోవడంతో తీవ్రమైన కడుపునొప్పితో మృత్యువాతపడ్డాయి. సోమవారం రాత్రి గొర్రెలు అపస్మారక స్థితిలోకి వెళ్లగా పశువైద్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స చేస్తుండగానే కొన్ని గొర్రెలు మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. రూ.5 లక్షల నష్టం కలిగినట్లు బాధితులు చెప్పారు. పోస్టుమార్టం చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన గొర్రెలకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. గొర్రెలకు ఎలాంటి బీమా సదుపాయం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

## ఆటోను ఢీకొట్టిన బైక్

### తెగిపడిన ద్విచక్ర వాహనదారుడి చేయి



**మామడ, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

మామడ మండలం కొరిటికల్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న యువకుడి చేయి తెగిపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన భరత్, తుకారాం.. కొరిటికల్‌లో కూలీ పనులు చేసుకుంటూ కుంటుబాన్ని పోషించుకుంటున్నారు. సాయంత్రం ద్విచక్రవాహనంపై కొరిటికల్ వైపు వెళ్తుండగా కొరిటికల్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనం అతివేగంగా ఉండడంతో ఈ ప్రమాదంలో భరత్ చేయి తెగి రోడ్డుపై పడింది. తుకారాం కాలు విరిగింది. స్థానికులు 108లో క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైల్వే జీఎంను కలిసిన ఎమ్మెల్యే

**ముథోల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం శ్రీవాస్తవను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. నయగావ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం, బాసరలో రైళ్ల హాల్టింగ్ కోసం విన్నవించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలోని సరస్వతీ అమ్మవారి దర్శనానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తారని, అన్ని రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని ఆయన కోరారు. ఇందుకు సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం శ్రీవాస్తవ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# నోయిడాలో సైబర్ నిందితుడిని అరెస్టు చేసిన సిర్పూర్ పోలీసులు

**సిర్పూర్ (టి), నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టిన ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షణలో సిర్పూర్(టి) పోలీసులు ఓ కేసును ఛేదించారు. పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌటాల సీఐ సంతోష్ కుమార్, ఎస్సై సురేష్ వివరాలు వెల్లడించారు. 2025 జూన్‌లో సిర్పూర్(టి)కి చెందిన ఓ యువకుడు వాట్సప్, టెలిగ్రామ్ ద్వారా మోసపోగా ఠాణాలో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు వర్క్ ఫ్రం హోం, వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా గూగుల్ రివ్యూలు ఇస్తే డబ్బులు వస్తాయని, క్రిప్టో కరెన్సీ యాప్ ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేస్తున్న ముఠాను గుర్తించారు.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన అభిషేక్ కుమార్ (19), అతడి బావ రాజు అత్రి తోపాటు కొంత మంది ఈ మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ వారియర్ వినోద్‌తో పాటు బృందం నిందితులను గుర్తించగా.. ఎస్సై సురేష్, బృందం, ఏఎస్సై చంద్రశేఖర్, కానిస్టేబుల్ హన్మంతులతో కలిసి నోయిడాకు వెళ్లారు. నాలుగు రోజుల పాటు గాలించి ఈ నెల 15న అభిషేక్ కుమార్‌ను పట్టుకున్నారు. కోర్టులో హాజరుపర్చి ట్రాన్సిట్ వారెంట్ పొంది సిర్పూర్(టి)కు తీసుకొచ్చారు. అనంతరం విచారణ చేపట్టగా... నిందితుడు తన ఆధార్, పాన్‌కార్డులతో అనేక బ్యాంకు ఖాతాలు తెరచివాటిని మోసపూరిత లావాదేవీలకు వినియోగించినట్లు అంగీకరించాడు. సిర్పూర్(టి)కి చెందిన బాధితుడి నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసి కేవలం రూ.10 వేలు తిరిగి ఇచ్చినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఇలా వచ్చిన సొమ్మును తన బావ రాజుకు పంపించి ఇద్దరూ కలిసి ఖర్చు చేసేవారిని తెలిపారు. ఈ కేసులో మిగతా నిందితుల కోసం గాలింపు కొనసాగుతున్నట్లు సీఐ తెలిపారు.

## అట్రాసిటీ కేసుపై పోలీసుల విచారణ

**నెన్నెల, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

మండలంలోని దమ్మిరెడ్డిపేటకు చెందిన నలుగురిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అ ట్రాసిటీ కేసుపై బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొండ చంద్రయ్య, కొండ రాజక్క, ఓదెలు, మొగిళి, రాజక్క భూమి విషయంలో జరిగిన గొడవలో కులం పేరుతో దూషించారని జంగాల్‌పేట్‌కు చెందిన కోట శంకర్ ఈ నెల 16న నెన్నెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై ప్రసాద్ నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏసీపీ ఫిర్యాదుదారుడు శంకర్, స్థానికులతో మాట్లాడి గొడవకు సంబంధించిన వివరాలు సేకరించారు.

## వసతి గృహాల పర్యవేక్షణకు పర్యవేక్షణకు 'పల్స్ యాప్'

### ఐటీడీఏ ఇంచార్జీ పీవో యువరాజ్ మర్మాట్



**ఉట్నూర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల పర్యవేక్షణకు ఐటీడీఏ పల్స్ యాప్ దోహదపడుతుందని ఐటీడీఏ ఇంచార్జీ పీవో యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులు, వసతిగృహ అధికారులు, ఏటీడీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పల్స్ యాప్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో అందిస్తున్న రోజువారి మెనూ వివరాలతో ఫొటోను అప్లోడ్ చేయడం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు, ఉపాధ్యాయుల పనితీరు, బోధన అంశాలు తెలుసుకోవచ్చన్నారు. వచ్చేవారం నుంచి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు.

# దొంగలను పట్టించిన సీసీ కెమెరా

**జైనథ్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఐదు రోజుల కిందట జరిగిన దొంగతనం కేసును పోలీసులు సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా ఛేదించారు. నిందితుల నుంచి ఆటోతో పాటు రూ.7,140 నగదు, రెండు ఫోన్‌లను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. జైనథ్ సీఐ శ్రావణ్ కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని హత్తిఘాట్ పంపుహౌస్ గోదాంలో ఈ నెల 14న దొంగతనం జరిగిందని, రూ.4.80 లక్షల విలువైన పరికరాలు ఎత్తుకెళ్లారని సూపర్‌వైజర్ కరుణాకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ నెల 17న భోరజ్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సీసీ కెమెరాలో కనిపించిన వ్యక్తులుగా అనుమానించి



అదుపులోకి తీసుకొని విచారించగా.. దొంగతనం చేసి నట్లు ఒప్పుకున్నారు. మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశారు. అందులో కేఆర్కే కాలనీకి చెందిన కొడిపెల గణేష్, కైలాస్‌నగర్‌కు చెందిన గుంట ఉదయ తేజ, జాదవ్ కృష్ణ చైతన్య, ముగ్గురు మైనర్లతో పాటు చోరీ పరికరాలు కొనుగోలు చేసిన స్క్రాప్ దుకాణం యజమానులు పిట్టలవాడకు మహ్మద్ ఇమ్రాన్ ఉద్దీన్, మహ్మద్ అబ్దుల్ వసీంలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన సీఐ శ్రావణ్ కుమార్, ఎస్ఐ గౌతంను డీఎస్పీ జీవన్ రెడ్డి అభినందించారు.

## అటవీ అధికారుల సస్పెన్షన్?

**కడెం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలోని రాంపూర్ ఈస్ట్ బీట్ అధికారి మహేందర్, డీఆర్వో చంద్రమౌళిని ఖానాపూర్ ఎఫ్‌డీవోశివకుమార్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. రాంపూర్ బీట్ పరిధిలో స్మగ్లర్లు గత నెలలో టేకుచెట్లను నరికినా నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ఉడుంపూర్ రేంజ్ అధికారి అనితను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అమె స్పందించలేదు.

## చిత్రలేఖనం పోటీలు

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం నిర్మల్ లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. పాల్గొన్న పాఠశాలలు విజయ హై స్కూల్ మంజులాపూర్, జడ్పీహెచ్ఎస్ మంజులాపూర్, టిజిఆర్ఎస్ సోఫినగర్, ఆల్ ఫోర్స్ హై స్కూల్ ఆదర్శ్ నగర్, ప్రిన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, శ్రీ సరస్వతి శిశుమందిర్, దక్కన్ హై స్కూల్ ఉర్దూ మీడియం, గర్ల్స్ హై స్కూల్ జుమేరాత్ పెట్, కేంద్ర గ్రంథాలయ సిబ్బంది విజయ శ్రీ, రాథోడ్ మోహన్ సింగ్, భోజనం లెనిన్, 250 విద్యార్థిని విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొనడం జరిగింది.

## దరఖాస్తుల ఆహ్వానం

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

విపత్తుల సమయంలో రక్షణ చర్యల్లో పాల్గొని సేవలు అందించేందుకు తోడ్పడే ఆపదమిత్ర శిక్షణకు జిల్లాలోని స్కౌట్స్ మాస్టర్లు, గైడ్స్ కెప్టెన్లు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజేశ్వర్ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. వచ్చేనెల మొదటి వారంలో హైదరాబాద్‌లో వారం పాటు శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లతో పాటు రెస్క్యూ ఆపరేషన్ కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 22లోగా జిల్లా కార్యదర్శి స్వామిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6281966588 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## స్కాలర్షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో 9, 10 తరగతులు చదువుతున్న ప్రభుత్వ గుర్తింపు పొందిన, ఎయిడెడ్ పాఠశాలల బీసీ, ఈబీసీ విద్యార్థులు ప్రీమెట్రిక్ స్కాలర్షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ తరఫున 2025-26 విద్యా సంవత్సరానికిగాను రూ.4 వేలు ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ మంజూరు చేయ బడుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 15వ తేదీలోగా http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

# కేటీఆర్ విఫల నాయకుడు

- ఆయన నాయకత్వంలో అన్నీ ఓటములే
- స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీదే విజయం
- మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి

**మందమర్రి, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ విఫల నాయకుడని, ఆయన నాయకత్వం వహించిన ఎన్నికలన్నీ ఓటమి చవిచూశాయని ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ పార్టీ విజయమే మరో నిదర్శనమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం అయిన నాటి నుంచి పార్టీ పతనపు అంచుల్లోకి చేరుకుందని పార్టీ కోలుకునే స్థాయిలో లేదన్నారు. మంగళవారం బొక్కలగుట్ట వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రజాప్రభుత్వం ఏర్పడడం తట్టుకోలేక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాం హౌజ్‌కు పరిమితమయ్యాడని పేర్కొన్నారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి కేటీఆర్ కుటుంబం కోట్లు గడిచిందని తెలిపారు. లెక్కలేని కుంభకోణాలు చేసి రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేశారని విమర్శించారు. వీరి అవినీతి భాగోతం గురించి కేటీఆర్ చెల్లెలు కవిత పదేపదే ఆరోపిస్తున్నా జవాబు చెప్పడం లేదని వారు తప్పించుకు తిరుగుతున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ సంక్షేమ రంగాన్ని పరుగులు పెట్టిస్తూ పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లోని ఆరు గ్యారంటీలను అమలు



చేయడంతో సన్నబియ్యం పథకాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలకు సంబంధించి తమ ప్రభుత్వంతోపాటు అభ్యర్థి నవీన్ యాదవ్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్, బీజేపీలు రెండు జతకట్టి ఎన్నికుట్రలు చేసినా అవి ఫలించలేదన్నారు. రానున్నరోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగవడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రాజు, పి రఘునాథ్‌రెడ్డి, ఎండీ అజీజ్, గాండ్ల సమ్మయ్య, వొడ్నాల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, బొలిశెట్టి కనకయ్య, ఎండీ ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుంచి పత్తి కొనుగోలు

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
నేటి నుంచి పత్తి కొనుగోలు చేపట్టనున్నట్లు మంగళవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ తలపెట్టిన బంద్‌ను విరమించుకున్న నేపథ్యంలో ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సీసీఐ, ప్రైవేటు ద్వారా పత్తి కొనుగోళ్లు యథావిధిగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మున్సిపాలిటీకి నిధులు మంజూరు

**కాగజ్‌నగర్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలగిపోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్ని మున్సిపాల్టీలకు నిధులను విడుదల చేసింది. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి రూ.18.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలో అత్యవసరంగా ఉన్న రోడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. దీని కోసం ఇటీవల అధికారులు శిథిలావస్థకు చేరిన రోడ్లపై సర్వేలు నిర్వహించారు. నిధులు రానుండడంతో అధికారులు డిటైల్ ప్రాజక్టు రిపోర్టు(డీపీఆర్) సిద్ధం చేస్తున్నారు. టెక్నికల్ అనుమతి పొందగానే టెండర్ పనులు ప్రారంభించనున్నారు. కాగజ్‌నగర్ మెయిన్ మార్కెట్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఆ రోడ్డుపై పలు చోట్ల గుంతలపడడంతో నిత్యం వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారు. సర్‌సిల్క్ రాం మందిర్ నుంచి కోసిని డాడానగర్ చౌరస్తా వరకు రహదారిపై పగుళ్లు తేలాయి. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు డంపింగ్ యార్డు వద్ద సీసీ రోడ్డు లేదు. ఈ సమస్యలపై నెల రోజుల క్రితం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కాగజ్‌నగర్ మున్సిపాల్టీకి వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.18.70 కోట్లు విడుదల అయ్యాయి. నిధులు విడుదల కావడంతో రోడ్ల సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను వివరణ కోరగా అభివృద్ధి పనుల కోసం డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామన్నారు.

# పేదింటి ఆడబిడ్డల రుణం తీర్చుకుంటాం

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**జన్నారం, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
పేదింటి ఆడపడుచు రుణం తీర్చుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలానికి చెందిన సుమారు 200 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ప్రతీ ఇంటికి 200 యూనిట్ల విద్యుత్‌ను అందజేస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి స్థాయిలో పైచేయి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం...**

రైతు పండించిన వరి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని రేండ్లగూడ, మొర్రిగూడ గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసియుల్లా, మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు ఇసాక్, మాణిక్యం, అల్లం రవి, దుమ్మల రమేశ్, కరుణాకర్, అజారోద్దీన్ పాల్గొన్నారు.



# పత్తి కొనుగోలు చేసినట్టు నిరూపిస్తే.. ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేస్తా



**ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
గతంలో ఉన్న ప్రభుత్వాలు 20 శాతం తేమతో పత్తి కొనుగోలు చేసినట్లు నిరూపిస్తే.. తాను ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేసా ్తనని పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మీడి యాతో మాట్లాడారు.. కేటీఆర్ రైతు సమస్యలపై ఆదిలాబాద్ కు వచ్చి.. బీజేపీ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖలు చేయడం సరి కాదన్నారు.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభు త్వం ఎప్పుడూ రైతులను పట్టించుకోలేదని.. ఇప్పుడు అధికా రం పోయాక రైతుల పక్షాన పోరాడుతామని ముసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో రైతుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చి.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలచే రైతుల ముసుగులో మాట్లాడించి..కేంద్రం, సీసీ ఐపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక వారి మెదడులు పని చేయడం లేదన్నారు. ఏం చేయాలో తెలియక ఇష్టం వచ్చినట్లు విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎద్దేవ చేశారు. సీసీఐ నిబంధనలు గత 12 ఏళ్లుగా ఉన్నవే ఇప్పుడు కూడా కొనసాగుతున్నాయని అందులో ఎలాంటి మార్పు లేదన్నారు.ఆదిలాబాద్ నుంచి టెక్స్ టైల్ పార్కు ఇతర జిల్లాకు పోతుంటే..గతంలో మాట్లాడని జోగురామన్న ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ చేసిన పాపాల గురించి సొంత చెల్లి కల్వకుంట్ల కవితనే బయటపెడుతుందని అది తెలుసుకోవాలన్నారు. నాయకులు బంతి పెల్లి దయాకర్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్టులపై అప్రమత్తంగా ఉండండి

**నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల**

**నిర్మల్, నవంబర్ 18 (ప్రభాత సమాచారం)**
భారతదేశంలో సైబర్ నేరగాళ్లు ఇటీవలే డిజిటల్ అరెస్టుల పేరుతో అమాయకులను మోసం చేస్తున్నారని దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. భారతదేశ చట్టాలు డిజిటల్ అరెస్ట్ చట్టంలేదని ప్రజలు ఎవరికి భయపడవద్దని ఆమె సూచించారు. డిజిటల్ అరెస్ట్ అని ఎవరైనా మిమ్మల్ని బెదిరిస్తున్నారా? అయితే జాగ్రత్త! ఇటీవలి కాలంలో చాలా మంది సైబర్ మోసగాళ్లు పోలీసు/ఇతర అధికారుల పేర్లు చెప్పి భయపెట్టి డబ్బులు వసూలు చేసే ఘటనలు పెరుగుతున్నాయి. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనే వ్యవస్థ లేదు. వీడియో కాల్, వాట్సప్, లేదా ఫోన్ ద్వారా ఎవరైనా “మీరు కేసులో ఉన్నారు మీరు అరెస్టులో ఉన్నారు అని బెదిరిస్తే ప్రజలు నమ్మవద్దన్నారు. వ్యక్తిగత, బ్యాంక్, ఓ.టి.పి, యు.పి.ఐ, ఆధార్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు. ఇటువంటి మోసాల నుండి రక్షణ కోసం, వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని సూచించారు.

